aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
బుధవారం
01-04-2026 సంపుటి : 01 సంచిక : 10 పేజీలు : 08 వెల : ₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

## కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం



- ఎల్‌డీఎఫ్‌తో బిజెపి కుమ్మక్కు
- అందుకే శబరిమల ఘటనపై మాట్లాడడం లేదు
- మరోమారు విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ నేత

తిరువనంతపురం, మార్చి 31( మహాప్రభ)
కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అయితే అధికార అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య
-మిగతా 3లో

## బెంగాలీలను బీజేపీ అవమానం చేస్తోంది



- నా ముఖం చూసి మాత్రమే ఓటేయండి
- సెంటిమెంట్ మాటలతో మమత ప్రచారం

కోల్‌కతా, మార్చి 31( మహాప్రభ)
భారతీయ జనతా పార్టీ పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. బీజేపీని 'అనాగరిక' పార్టీగా అభివర్ణించారు. దేశంలోని బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను టార్గెట్ చేస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వారిని వేధింపులు, అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాంకురాలో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మమతా బెనర్జీ ప్రసంగించారు. టీఎంసీ అభ్యర్థులు ఎవరనేది కాకుండా తన నాయకత్వాన్ని మాత్రమే చూడాలని ఈ సందర్భంగా ఓటర్లను మమతాబెనర్జీ కోరారు. 294 నియోజకవర్గాల్లోనే తననే అభ్యర్థిగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో అవకతవకలను ప్రధానంగా ఆమె తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ, ఒకేరోజు 30,000 అప్లికేషన్లు దాఖలైనట్టు పార్టీ నేత అభిషేక్ బెనర్జీ వద్ద సమాచారం ఉందని తెలిపారు. బెంగాల్ ఎన్నికల ఫలితాలను
-మిగతా 3 లో

## న్యూక్లియర్ రేస్!

- పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అణ్వాయుధాల కోసం పోటాపోటీ
- అణు విధానంపై మారుతున్న ప్రపంచ దేశాల వైఖరి
- రక్షణ కవచంగా అణ్వాయుధాలను వాడుకోవాలని యోచన

3




## అమెరికా టెక్ కంపెనీలే మా లక్ష్యం..

- గూగుల్, యాపిల్, మైక్రోసాఫ్ట్ యూనిట్లపై దాడి చేస్తాం..!
- ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కీలక హెచ్చరిక




2




## మూసీపై ఆన్‌లైన్లో ప్రజాభిప్రాయ సేకరణ

### ప్రజాస్వామ్య పద్ధతిలో మూసీ పునరుజ్జీవం పనులు

- 15 రోజులు ప్రజాభిప్రాయాలు స్వీకరిస్తాం
- వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం
- విలువైన సూచనలిచ్చిన వారితో 'సబ్ కమిటీ' సమావేశం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్ మార్చి 31( మహాప్రభ)
మూసీ పునరుజ్జీవం పనులను ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగిస్తామని డిప్యూటీ సీఎం, మూసీ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మూసీ క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, మంత్రి పొన్నం ప్రభా కర్‌తో కలిసి మూసీ పునరుజ్జీవం పనుల పురోగతిపై అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ మూసీనది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయ పనులకు మార్చి 28న శంకుస్థాపన చేశామని తెలిపారు. అప్పటి నుంచి మూసీ ఫేస్-1, ఫేస్-2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన
-మిగతా 3 లో



## గుజరాత్ టైటాన్స్‌పై పంజాబ్ కింగ్స్ విక్టరీ

- 3 వికెట్ల తేడాతో విజయం సాధించిన పంజాబ్
- అజేయ హాఫ్ సెంచరీ చేసిన కూపర్ కన్నోలీ
- బౌలింగ్‌లో రాణించిన ప్రసిధ్ కృష్ణ

న్యూ ఛండీగడ్: మార్చి 31( మహాప్రభ)
ఐపిఎల్ సీజన్-19లో పంజాబ్ కింగ్స్ బోణీ కొట్టింది. మహారాజ యదవింద్రసింగ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ జట్టు మూడు వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుచేసింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 162 పరుగులు చేయగా.. అనంతరం పంజాబ్ కింగ్స్ 19.1ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 165పరుగులు చేసి విజయం సాధించింది. ఛేదనలో భాగంగా పంజాబ్ కింగ్ బ్యాటర్ కూపర్ కనోలీ(72నాటౌట్) చివరి వరకు క్రీజ్‌లో ఆ జట్టుకు విజయాన్నందించాడు. ప్రభ్ సిమ్రన్(37), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(17) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. గుజరాత్ బౌలర్లు ప్రసిధ్ కృష్ణకు మూడు,
-మిగతా 3 లో

## కాళేశ్వరంపై కాంగ్రెస్ పగ

### కాంగ్రెస్, బీజేపీది ఫెవికాల్ బంధం



- కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలు అభ్యంతరకరం
- ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టత కరువు
- దిశానిర్దేశం లేకుండా ముగిసిన అసెంబ్లీ సమావేశాలు
- రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి పంపాలి
- పాంగులేటి అవినీతిని బయటపెట్టినందుకే మా ఎమ్మెల్యేల సస్పెన్షన్ : మాజీమంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ మార్చి 31( మహాప్రభ)
కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం పగబట్టిందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం పేరుతో రైతులకు శిక్ష వేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ మీద ద్వేషం ఉంటే తమకు శిక్ష వేయాలనీ, రైతుల పొట్ట కొట్టొద్దని కోరారు. తక్షణమే నిధులను విడుదల చేసి కాలువలకు నీళ్లు
-మిగతా 3 లో

## ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం



- బంకర్ బస్టర్లతో అమెరికా విధ్వంసం
- దుబాయ్‌లో కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ దాడి
- హార్ముజ్‌లో టోల్ వసూలుకు ఇరాన్
- పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదముద్ర
- 'ధైర్యం చూపండి..చమురు తెచ్చుకోండి' : రెచ్చగొడుతున్న ట్రంప్
- అమెరికా అధ్యక్షుల మెహర్బానీ కోసం గల్ఫ్ దేశాల వెంపర్లాట

టెహ్రాన్: మార్చి 31( మహాప్రభ)
ఇరాన్‌లో అణుకేంద్రాలు కలిగి ఉన్న కీలక నగరం ఇస్ఫహాన్‌పై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై 2వేల పౌండ్ల బంకర్ బస్టర్లతో భీకర స్థాయిలో విరుచుకుపడింది. దీంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. అమెరికా అధికారులను ఉటంకిస్తూ 'వాల్‌స్ట్రీట్ జర్నల్' ఈ విషయాన్ని పేర్కొంది. మరోపక్క ఈ దాడికి సంబంధించిన వీడియోను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు. దాడికి సంబంధించి ఆయన ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అయితే, ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై అమెరికా- ఇజ్రాయిల్ దాడులకు పాల్పడ్డాయని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.
-మిగతా 3 లో



## నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

- ఇక శాశ్వత రాజధానిగా అమరావతి
- ఇది తెలుగువారికి ఎంతో గర్వకారణం
- టిడిపి ఎంపిలు కృష్ణదేవరాయలు, కలిశెట్టి

న్యూఢిల్లీ మార్చి 31( మహాప్రభ)
రాష్ట్ర ప్రజలకు శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందని లోక్‌సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. అమరావతి తీర్మానం లోక్‌సభ ఆమోదం తరవాత ఇక ప్రజల రాజధానిగా అమరావతి వెలుగొందుతుందని అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. బుధవారం పార్లమెంట్‌లో అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. ఈ బిల్లు ద్వారా రాజధాని రైతులకి మరింత భరోసా వస్తోందని ఆయన
-మిగతా 3 లో

## ఉచిత బస్సుతో మహిళలకు మేలు

- పదివేల కోట్లు ఆదాచేసిన మహిళలు
- ఆర్టీసీ అభివృద్ధికి అనేక చర్యలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్, మార్చి 31( మహాప్రభ)
తెలంగాణ ప్రజా భవన్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ప్రగతిపై కీలక ప్రకటన చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని ఆయన గుర్తుచేశారు. డిసెంబర్ 9, 2023న ప్రారంభమైన మహాలక్ష్మి
-మిగతా 3 లో

## ఐదు రోజులు వానలు

- ఉదయం ఉక్కపోత సాయంత్రం ఈదురుగాలులు
- రాష్ట్రంలో ఆరెంజ్ అలర్ట్ జారీ : వాతావరణ శాఖ



హైదరాబాద్ మార్చి 31( మహాప్రభ)
ద్రోణి, గాలి అనిశ్చితితో పాటు ఉపరితల చక్రవాకం ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వదగంద్ర వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాలకు బుధవారం ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందనీ, రాత్రి వేళల్లో ఉక్కపోత వాతావరణం ఉంటుందని పేర్కొంది

# 50 ఏండ్ల తర్వాత మళ్లీ చంద్రుడి చెంతకు



**వాషింగ్టన్ మార్చి 31( మహాప్రభ)**
50 ఏండ్ల తర్వాత చంద్రుడి చెంతకు వ్యోమగాములను పంపేందుకు నాసా సిద్ధమైంది. ఆర్టెమిస్ II మిషన్ ద్వారా నలుగురు వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్లనున్నారు. అన్నీ అనుకున్నట్టు జరిగితే... బుధవారం భారత కాలమానం ప్రకారం ఉదయం 3.54 గంటలకు నాసా రాకెట్ నింగిలోకి దూసుకెళుతుంది.ఆర్టెమిస్ ప్రోగ్రామ్‌లో భాగంగా వ్యోమగాముల సహితంగా అమెరికా జరుపుతున్న మొదటి ప్రయోగం ఆర్టెమిస్ -- IIనే. ఇందులోని వ్యోమగాములు చంద్రుడి కక్ష్యపై పరిశోధనలు జరిపి తిరిగి భూమి పైకి వస్తారు. వీరంతా జాబిల్లి పైన దిగకుండా దగ్గరగా ప్రయాణిస్తారు. సుమారు పది రోజుల పాటు భూ కక్ష్యను పరిశీలిస్తారు. ఈ వాహక నౌకలో అత్యాధునిక ప్రాణ రక్షణ వ్యవస్థను పొందుపరిచారు.

# విజయ్ పై కేసు నమోదు



**చెన్నై మార్చి 31( మహాప్రభ)**
తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ చీఫ్ విజయ్ కు ఎన్నికల సంఘం షాకిచ్చింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు ఆయనపై ఇసి కేసు నమోదు చేసింది. వచ్చే నెలలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. ఈ నేపథ్యంలో టీవీకే చీఫ్ విజయ్ రాష్ట్రమంతా పర్యటిస్తున్నారు. ఇటీవల చెన్నైలో ఓ భారీ బహిరంగ సభ కూడా నిర్వహించారు. ఈ సభ ద్వారా ఎంతోమందికి ఇబ్బందులెదురయ్యాయి. సోమవారం ఎస్ఆర్‌పి కోయిల్ సౌత్ స్ట్రీట్ నుండి పెరవల్లూరు జంక్షన్ వద్ద విధి నిర్వహణలో ఉండగా టివికెకు చెందిన సుమారు మూడు వేల మంది సభ్యులు రోడ్డుపై గుమిగూడారని కొలత్తూరు నియోజకవర్గ సర్వైలైన్స్ టీమ్ ఇన్‌ఛార్జి అధికారి వి.కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్టీ జెండాలు పట్టుకుని ప్రజలకు, వాహనాలకు ఆటంకం కలిగించారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా గ్రేటర్ చెన్నై నగర పోలీసుల పరిధిలోని పెరవల్లూరు పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. రోడ్లు బ్లాక్ చేయడం, అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోవడం, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి అంశాల్ని పిర్యాదులో పేర్కొనడంతో విజరుపై ఐదు సెక్షన్ల కింద కేసు నమోదైంది. విజయ్ తోపాటు సభకు హాజరైన దాదాపు వేలాది మంది పార్టీ కార్యకర్తల్ని కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు సమాచారం. దీనిపై తదుపరి చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

# బిజెపి మహారాష్ట్ర, ఢిల్లీలో ఆడిన ఆటే బెంగాల్‌లోనూ ఆడుతోంది :



**కోల్‌కతా : మార్చి 31( మహాప్రభ)**
2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందని సిఎం మమతాబెనర్జీ ఆరోపించారు. ఈమేరకు ఆమె భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు మంగళవారం లేఖ రాశారు. 'బెంగాల్ ఓటర్ల జాబితాలోకి.. నివాసితుల్ని కానివారిని, బయటివారిని అక్రమంగా చేర్పించేందుకు వేలాది నకిలి ఫారం6 దరఖాస్తులతో నింపేస్తున్న బిజెపి ఏజెంట్లు బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం వద్ద రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఇది ఓటర్లను హైజాక్ చేసే ప్రయత్నం. మహారాష్ట్ర, ఢిల్లీలలో బిజెపి విజయవంతంగా ఆడిన అదే నీచమైన ఆట ఇది' అని మమతా ఎక్స్ పోస్టులో విమర్శించారు. ఇక ఎస్ఐఆర్ ప్రక్రియలో 60 లక్షల మంది ఓటర్లను తొలగించారు. ఈ ప్రక్రియ వల్ల 200 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే ఎన్నికల సంఘం ఇప్పుడు మరలా బిజెపి ఏజెంట్లు అందిస్తున్న దరఖాస్తును స్వీకరించడానికి సిద్ధపడుతోంది. ఈ చర్య చట్టవిరుద్ధం. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధం కూడా. ఈ చర్య బెంగాల్‌లలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలపై ప్రత్యక్ష దాడి కూడా. ఈ అప్రజాస్వామిక ప్రక్రియను తక్షణమే భారత ఎన్నికల సంఘం నిలిపివేయాలి. సుప్రీంకోర్టు ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని, 28.2.2026న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రచురించిన తర్వాత నకిలీ ఓటర్లను చేర్చకుండా చూడాలని మమతా తన లేఖలో డిమాండ్ చేశారు.

# సామ్రాట్ సంప్రతి మ్యూజియాన్ని ప్రారంభించిన మోడీ



**గుజరాత్ : మార్చి 31( మహాప్రభ)**
మహవీర్ జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని మహావీర్ జైన ఆరాధన కేంద్రం క్యాంపస్‌లోని కోబా తీర్థ్‌లో సామ్రాట్ సంప్రతి మ్యూజియాన్ని మంగళవారం ప్రధాని మోడీ ప్రారంభించారు. అశోకుని మనవడైన సామ్రాట్ సంప్రతి పేరు మీద స్థాపించిన ఈ మ్యూజియం జైనమతం యొక్క గొప్ప చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రదర్శిస్తుంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి వావ్-థరద్‌లో పర్యటించి రూ. 20 వేల కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభం చేసి జాతికి అంకితం చేయనున్నారు.

# హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి

-ద్విచక్ర వాహనాల వల్లే అధిక ప్రమాదాలు
-చేగుంటలో :అరీవ్ అలీవ్ 'కార్యక్రమం -- ఉచిత కంటి పరీక్షలు
-జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్.



**మెదక్ జిల్లా,-మార్చి 31( మహాప్రభ)**
మెదక్: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మెదక్ జిల్లా చేగుంట పోలీస్ స్టేషన్‌లో :'అరీవ్ అలీవ్ 'కార్యక్రమం లో భాగంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి కారణాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు అధికంగా గురవుతున్నారని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. రైడర్‌తో పాటు పిలియన్ కూడా ఐ యస్ ఐ ప్రమాణిత హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాలు కేవలం గణాంకాలు కాదని, ప్రతి ప్రమాదం వెనుక ఒక కుటుంబం బాధ, కన్నీరు దాగి ఉంటుందని అన్నారు. నిర్లక్ష్యం, అసావధానం కారణంగా ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఎస్పీ స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం నేరమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. అలాగే అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర అలవాట్లను నివారించాలని తెలిపారు. చివరగా, ప్రమాదాలు విధి కాదని---మన నిర్లక్ష్య ఫలితమేనని స్పష్టం చేస్తూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి తమ కుటుంబాలను రక్షించుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డియస్పీ నరేందర్ గౌడ్, సిఐలు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి.

-ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలి
-గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలి.
-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా ,మార్చి 31( మహాప్రభ)**
99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, సాయిల్ హెల్త్ కార్డ్, వ్యవసాయ తదితర ప్రభుత్వ పథకాల గురించి, ప్రజలకు వివరించాలని అన్నారు.గ్రామసభల్లో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతి కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభలు నిర్వహణతో పాటు గ్రామంలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాభితా చదివి వినిపించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో జరిగే సభకు అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హౌసింగ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు, తహశీల్దార్, ఎంపి డి ఓ లు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరు కావాలని స్పష్టం చేశారు. గ్రామ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా టెంట్లు, కుర్చీలు, తాగునీరు ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారి కోసం గ్రామ సభలో ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని మంగళ వారం ఒక ప్రకటన తెలిపారు.

# అమెరికా మీకు సాయం చేయదు

ఇరాన్‌పై యుద్ధంలో కలిసిరాని
బ్రిటన్ సహా మిత్ర దేశాలకు డొనాల్డ్ ట్రంప్ కౌంటర్



**న్యూఢిల్లీ మార్చి 31( మహాప్రభ)**
పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో ఇంధన కొరతనుఎదుర్కొంటున్న దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు ప్రత్యామ్నాయాలు సూచించారు. అమెరికా నుంచి చమురు కొనండి లేదా ఇరాన్ అడ్డగించిన హెర్ముజ్ జలసంధి ద్వారా చమురు సరఫరాలు సాధించుకోండి అంటూ మంగళవారం యుద్ధ ప్రభావిత దేశాలకు ట్రంప్ పిలుపునిచ్చారు. యుద్ధంలో చేరాలంటూ తాను ఇచ్చిన పిలుపును తిరస్కరించిన మిత్రదేశాలపై ట్రంప్ మండిపడ్డారు. దేశాలు తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలి. మిమ్మల్ని కాపాడేందుకు అమెరికా అక్కడ ఎప్పుడూ ఉండదు. ఇరాన్ దాదాపుగా నాశనమైంది. ఒక కష్టమైన పని పూర్తయింది. వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌ను నిర్వీర్యం చేయడంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన బ్రిటన్‌సహా హెర్ముజ్ జలసంధి కారణంగా జెట్ ఇంధనం పొందలేని దేశాలన్నిటికీ నాదో సలహా. మొదటిది అమెరికా నుండి కొనండి. మా వద్ద పుష్కలంగా ఉంది. రెండవది కొంత ఆలస్యమైనా ధైర్యం కూడగట్టుకుని ఆ జలసంధికి వెళ్లి దానిని స్వాధీనం చేసుకోండి అని ట్రూత్ సోషల్ పోస్టులో పేర్కొన్నారు.

**హెర్ముజ్ తెరువకపోయినా..**
ఇరాన్‌తో యుద్ధం ఐదో వారానికి చేరుకోవడం.. ఈ సంక్షోభం అంతమయ్యే సూచనలు కన్పించకపోవడంతో ఎలాగైనా యుద్ధాన్ని ముగించేద్దాం అని ట్రంప్ యోచిస్తున్నారు. తాము ప్రారంభించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి తెరదించాలని తాను భావిస్తున్నానని ఆయన తన సన్నిహితుల వద్ద పేర్కొన్నారని, ప్రస్తుతం ప్రధాన సమస్యగా ఉన్న హెర్ముజ్ జలసంధి మూసివేత కొనసాగుతున్నా.. ఆ సమస్యను పక్కన పెట్టి యుద్ధాన్ని ముగించాలని భావిస్తున్నారని ఉన్నతాధికారులను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది.

**యుద్ధం ఖర్చులు గల్ఫ్ దేశాలు భరించాలి!**
ఇరాన్‌పై యుద్ధం కోసం కోట్లాది డాలర్లు ఖర్చు చేస్తున్న అమెరికా.. ఈ భారాన్ని గల్ఫ్ మిత్రదేశాలపై మోపేందుకు సిద్ధమవుతున్నది. అమెరికా ఆర్థిక వ్యవస్థపై పడుతున్న కోట్లాది డాలర్ల భారాన్ని తగ్గించుకొనేందుకు ట్రంప్ సరికొత్త ప్రతిపాదన చేసినట్టు తెలుస్తున్నది. అమెరికా చేస్తున్న వ్యయానికి సౌదీ అరేబియా, యూఏఈ వంటి సంపన్న అరబ్ మిత్ర దేశాల నుంచి రాబట్టాలని ట్రంప్ భావిస్తున్నారని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి.

# అమెరికా టెక్ కంపెనీలే మా లక్ష్యం..

-గూగుల్, యాపిల్, మైక్రోసాఫ్ట్ యూనిట్లపై దాడి చేస్తాం..!
-ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కీలక హెచ్చరిక




**న్యూఢిల్లీ మార్చి 31( మహాప్రభ)**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెందిరింపుల నేపథ్యంలో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కీలక హెచ్చరికలు చేసింది. హర్మూజ్ జలసంధి (ఎశీతీఎబఓ హ్ఝీఱ్)ని తెరవకుంటే ఖర్గ్ ద్వీపం, విద్యుత్ కేంద్రాలను పేల్చి వేస్తామని ట్రంప్ హెచ్చరించగా.. తామేమీ తక్కువ కాదంటూ యాపిల్, మైక్రోసాఫ్ట్ సహా ఆ దేశానికి చెందిన 18 కంపెనీలపై దాడులు చేస్తామని ఐఆర్‌జీసీ బదులు హెచ్చరిక చేసింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమెరికాలోని టెక్ కంపెనీలే తమ ప్రధాన లక్ష్యమని ఐఆర్‌జీసీ ఒక ప్రకటనలో వెల్లడించింది.పశ్చిమాసియా యుద్ధంలో ఊహించని విధంగా ప్రతి దాడులతో అమెరికాకు ముచ్చెమటలు పట్టిస్తున్న ఇరాన్ ఈసారి ఆ దేశంలోని టెక్ కంపెనీలను లక్ష్యంగా చేసుకోనుంది. ఖర్గ్ ద్వీపం, విద్యుత్ కేంద్రాలను పేల్చి వేస్తామని డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో అమెరికాకు వణుకు పుట్టించేలా ప్రముఖ టెక్ సంస్థలపై, పారిశ్రామిక కేంద్రాలపై దాడులు చేయాలనుకుంటోంది.ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రతీకార దాడులను తీవ్రతరం చేస్తామని, 18 సాంకేతిక కంపెనీలను టార్గెట్ చేస్తామని మంగళవారం ఐఆర్‌జీసీ వెల్లడించింది. మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్, ఇంటెల్, ఐబీఎం, టెస్లా, బోయింగ్.. వంటి కంపెనీలపై దాడులు చేసి.. వాటి వ్యవస్థను దెబ్బతీస్తామని హెచ్చరించింది. 'ఇరాన్‌పై అమెరికా దాడులకు ప్రతిచర్యగా ఈ 18 కంపెనీల యూనిట్లపై దాడులు చేస్తాం. ఏప్రిల్ 1 వ తేదీ బుధవారం టెహ్రాన్ కాలమానం ప్రకారం రాత్రి 8 గంటల నుంచి దాడులు కొనసాగుతాయి. ఉగ్ర స్థావరాలను గుర్తించే అమెరికా ఐసీటీ, ఏఐ కంపెనీలు ఇకపై మా న్యాయబద్ధమైన లక్ష్యాలు' అని ఐఆర్‌జీసీ ప్రకటించింది.

# ఆసుపత్రి నుంచి సోనియా డిశ్చార్జ్



**న్యూఢిల్లీ మార్చి 31( మహాప్రభ)**
కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. వాతావరణ మార్పుల వల్ల ఆమె పొట్ట, మూత్రనాళ ఇన్ఫెక్షన్‌కు గురవ్వడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు సర్ గంగా రామ్ ఆసుపత్రిలో చేర్పించారు. తన ఆరోగ్యం మెరుపడిన తర్వాత మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆమె తదుపరి చికిత్స ఇంటివద్దే కొనసాగుతుందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. మార్చి 24న చికిత్స కోసం సోనియాగాంధీ ఆసుపత్రిలో చేరారు. ఆమెకు డాక్టర్ డి.ఎస్.రాణా, డాక్టర్ ఎస్. నంది, డాక్టర్ అరూప్ బసుల బృందం పర్యవేక్షణలో చికిత్సనందించడం జరిగింది. ఇన్ఫెక్షన్ తగ్గించడానికి ఆమెకు యాంటీబయోటిక్స్ అందించాము. చికిత్సకు స్పందించి ఆమె కోలుకున్నారు. మంగళవారం డిశ్చార్జ్ అయ్యారు. ఆమె తదుపరి చికిత్స ఇంటివద్దే కొనసాగుతుంది అని ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ అజరు స్వరూప్ వెల్లడించారు.

## కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

మొదటి తరువాయి

జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ-లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.

## బెంగాలీలను బీజేపీ అవమానం చేస్తోంది

మొదటి తరువాయి

ప్రభావితం చేసేందుకు బిహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓటర్లను బీజేపీ దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. 'బిహార్‌లో చేసినట్టుగానే రైల్వేలను ఉపయోగించుకుని బయట ప్రాంతాల నుంచి ఓటర్లను రప్పించేందుకు బీజేపీ ప్లాన్ చేస్తోంది' అని అన్నారు. భారత ఎన్నికల కమిషన్‌పై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ చెప్పినట్టు ఈసీఐ నడుచుకుంటోందని, బీజేపీ-ఈసీ కలిసి ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులను ఊడలాక్కుంటాయని ఆరోపించారు. ఓటర్ల లిస్ట్‌లో కొందరిని టా÷-గ్ద÷ట్ చేసి తొలగించడం, మరికొందరిని జాబితాలో చేర్చడం జరుగుతోందన్నారు. తప్పుడు ఫారం-6 అప్లికేషన్లతో బీహార్ ఓటర్ల జాబితాలో చేరేందుకు ప్రయత్నించిన పలువురు బీజేపీ కార్యకర్తలు పట్టుబడినట్టు చెప్పారు. ఇది కేవలం ఓటర్ల హైజాకింగ్ కిందకే వస్తుందన్నారు. చట్టబద్ధత కలిగిన 60 లక్షల అప్లికేషన్లు ఇప్పటికే పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. బల్క్ ఎంట్రీలను మాత్రం ఫాస్ట్ ట్రాక్ చేస్తున్నారని అన్నారు. ఇదెంతమాత్రం రొటీన్ పక్రియ కాదని, స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడంపై జరుగుతున్న దాడి అని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో మాంసాహారంపై నిషేధం విధిస్తుందని, దొడ్డిదారిన ఎన్ఆర్‌సీ తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. సాంస్కృతిక ఆంక్షలు, వివాదాస్పద విధానాలు అవలంబిస్తోదని అన్నారు.

## మూసీపై ఆన్‌లైన్లో ప్రజాభిప్రాయ సేకరణ

మొదటి తరువాయి

రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో ఎబరఅతీసషఏస్త్రఖిఅశ్రీ.షశీఏ మెయిల్ ఐడీ ద్వారా ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను వ్యక్తం చేసిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని తెలిపారు. డిఫెన్స్ భూములు, మూసీ బాధితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్‌తో మాట్లాడటం ఇలా ఎక్కడికక్కడ పనులను విభజన చేసుకుని ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి, యావత్ క్యాబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకుని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని చెప్పారు. అందరి జీవితాల్లో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలవబోతోందని సూచించారు. అధికారులకు ఎలాంటి సలహాలు, సూచనలతోపాటు ఏ ఇతర అవసరాలున్నప్పటికీ మూసీ సబ్ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు. ఆ కమిటీ సభ్యులు 24 గంటలపాటు అందుబాటులో ఉంటారని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డీ నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినరు కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మనుచౌదరి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం

మొదటి తరువాయి

దాడుల నేపథ్యంలో ఈ ప్రాంతంలో వరుస పేలుళ్లు చోటుచేసుకోగా భారీగా మంటలు ఎగసిపడ్డాయి. దీనిపై ఇరాన్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా.. ఇరాన్ సుమారు 540 కిలోల యురేనియం నిల్వలను ఇస్ఫహాన్‌లో ఓ భూగర్భ కేంద్రానికి తరలించినట్టు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు.. తమతో ఒప్పందం కుదుర్చుకోకపోతే..ఇరాన్‌లో భారీ విధ్వంసాన్ని సృష్టిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇక్కడ భారీఎత్తున దాడులు జరగుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను కూల్చేశాం: ఐఆర్‌జీసీ

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తయారుచేసిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయి. ఐఆర్‌జీసీ అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఇస్ఫహాన్ ప్రాంతంలో ఎగురుతున్న ఈ డ్రోన్‌ను ధ్వంసం చేసినట్టు ఐఆర్‌జీసీ వర్గాలు పేర్కొన్నాయి.

### హార్ముజ్‌లో టోల్ వసూల్ : ఇరాన్ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదముద్ర

ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సముద్రమార్గాల్లో ఒకటైన హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై టోల్ వసూలుకు ఇరాన్ పార్లమెంట్ గ్రీన్ సిగల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి హార్ముజ్ నిర్వహణ ప్రణాళికకు పార్లమెంటరీ భద్రతా కమిటీ ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం ఈ మార్గం గుండా ప్రయాణించే నౌకలు ఇకపై ఇరాన్ కరెన్సీ 'రియాల్' రూపంలో టోల్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రణాళికలో భాగంగా ఆర్థికపరమైన అంశాలే కాకుండా, జలసంధి భద్రత, పర్యావరణ పరిరక్షణ, నౌకల భద్రత బాధ్యతలను ఇరాన్ తన పరిధిలోకి తీసుకుంది. అమెరికా-ఇజ్రాయిల్ నౌకలు ఈ జలసంధి గుండా ప్రయాణించడాన్ని ఇరాన్ పార్లమెంట్ పూర్తిగా నిషేధించింది. అలాగే ఇరాన్‌పై ఏకపక్షంగా ఆంక్షలు విధించే దేశాల నౌకలకు కూడా అనుమతి నిరాకరించాలని నిర్ణయించింది. ఈ వ్యూహాత్మక జలసంధిపై తన సార్వభౌమత్వాన్ని చాటుకుంటూనే ఆదాయాన్ని పెంచుకోవాలని ఇరాన్ యోచిస్తోంది. ప్రపంచ ముడిచమురు సరఫరాలో ఐదో వంతు జరిగే ఈ మార్గం అంతర్జాతీయ జలాల పరిధిలోకి వస్తుందని అమెరికా సహా పలు దేశాలు చెబుతున్నాయి. అక్కడ టోల్ వసూలుకు ఇరాన్‌కు చట్టబద్ధత లేదని పేర్కొంటున్నాయి.

# గుజరాత్ టైటాన్స్‌పై పంజాబ్ కింగ్స్ విక్టరీ

మొదటి తరువాయి



రబాడా, అశోక్ శర్మ, రషీద్ ఖాన్, సుందర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు పంజాబ్ కింగ్స్ బౌలర్లు వ్యాషక్, చాహల్ దెబ్బకు గుజరాత్ టైటాన్స్ స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. 2025 సీజన్ రన్నరప్ పంజాబ్ బౌలర్లు ప్రారంభం నుంచే గుజరాత్ బ్యాటర్లను కట్టడి చేశారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(39), జోస్ బట్లర్ (38) మాత్రమే రాణించడంతో గుజరాత్ ఆమాత్రమైనా స్కోర్ చేయగల్గింది. బట్లర్ ఔటయ్యాక గుజరాత్ బ్యాటర్లు తేలిపోయారు. ఓపెనర్లు సాయి సుదర్శన్(13), శుభ్‌మన్ గిల్(39)లు రాణించినా.. సొంత మైదానంలో పంజాబ్ కింగ్స్ బౌలర్ల ధాటికి గుజరాత్ మిడిలార్డర్ తేలిపోయింది. సాయి సుదర్శన్‌ను ఔట్ చేసిన యాన్సెన్ తొలి బ్రేక్ ఇవ్వగా.. జోస్ బట్లర్(38)తో కలిసి గిల్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ, చాహల్ ఓవర్లో గిల్ ఔటవ్వడంతో వీరి భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం గ్లెన్ ఫిలిప్స్(25) మెరుపు బ్యాటింగ్‌తో అలరించి స్కోర్‌బోర్డును ఉరికించాడు. అయితే.. విజరుకుమార్ ఓవర్లో అతడు అర్ష్‌దీప్ చేతికి చిక్కగా.. చాహల్ బౌలింగ్‌లో సిక్సర్‌కు యత్నించిన బట్లర్ బౌండరీ లైన్ వద్ద బార్ట్‌లెట్ క్యాచ్ అందుకోవడంతో వెనుదిరిగాడు. ఆ తర్వాత పంజాబ్ బౌలర్లు మరింత కట్టుదిట్టంగా బంతులు విసిరి వాషింగ్టన్ సుందర్(18), షారుక్ ఖాన్(4), రాహుల్ తెవాటియా (11నాటౌట్)కు బ్యాటింగ్‌కు అడ్డుగా నిలిచారు.. దీంతో గుజరాత్ 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది.

స్కోర్‌బోర్డు...

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి)శ్రేయస్ (బి)యాన్సెన్ 13, గిల్ (సి)కనోలే (బి)చాహల్ 39, బట్లర్ (సి)బార్ట్‌లెట్ (బి)చాహల్ 38, ఫిలిప్స్ (సి)యాన్సెన్ (బి)వ్యాషక్ 25, సుందర్ (సి)అర్ష్‌దీప్ (బి)వ్యాషక్ 18, షారుక్ ఖాన్ (సి)అర్ష్‌దీప్ (బి)వ్యాషక్ 4, తెవాటియా (నాటౌట్) 11, రషీద్ ఖాన్ (నాటౌట్) 0, అదనం 14. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 162పరుగులు.

వికెట్ల పతనం: 1/37, 2/83, 3/119, 4/129, 5/144, 6/150.

బౌలింగ్: ఆర్ష్‌దీప్ 4-0-42-0, బార్ట్‌లెట్ 4-0-36-0, యాన్సెన్ 4-0-20-1, వ్యాషక్ 4-0-34-3, చాహల్ 4-0-28-2.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ ఆర్యా (సి)అశోక్ శర్మ (బి)రబడా 7, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి)ప్రసిద్ కృష్ణ (బి)రషీద్ ఖాన్ 37, కనోలే (నాటౌట్) 72, శ్రేయస్ అయ్యర్ (సి)సుందర్ (బి)ప్రసిధ్ 18, వధేరా (సి)గిల్ (బి)సుందర్ 3, శశాంక్ సింగ్ (సి)బట్లర్ (బి)ప్రసిధ్ కృష్ణ 4, స్టాయినీస్ (సి)రషీద్ ఖాన్ (బి)ప్రసిధ్ కృష్ణ 0, యాన్సెన్ (సి)గిల్ (బి)అశోక్ శర్మ 9, బార్ట్‌లెట్(నాటౌట్) 11, అదనం 4. (19.1ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 165పరుగులు.

వికెట్ల పతనం: 1/7, 2/83, 3/110, 4/113, 5/118, 6/118, 7/144.

బౌలింగ్: సిరాజ్ 2-0-15-0, రబడా 3-0-34-1, అశోక్ శర్మ 3-0-31-1, రషీద్ ఖాన్ 4-0-29-1, సుందర్ 3.1-0-27-1, ప్రసిధ్ కృష్ణ 4-0-29-3.

# న్యూక్లియర్ రేస్!

మొదటి తరువాయి

- పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అణ్వాయుధాల కోసం పోటాపోటీ
- అణు విధానంపై మారుతున్న ప్రపంచ దేశాల వైఖరి
- రక్షణ కవచంగా అణ్వాయుధాలనువాడుకోవాలని యోచన



న్యూఢిల్లీ,

ఏడాది కాలంలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ రెండుసార్లు దాడి చేశాయి. ఈ రెండు దాడులకు మూల కారణం ఇరాన్‌కు అణ్వాయుధాలను తయారుచేయగల సామర్థ్యం ఉండడమే. దీన్ని అమెరికా, ఇజ్రాయెల్ రెండూ ముప్పుగా పరిగణిస్తున్నాయి. ఇరాన్‌లో ఇప్పుడు ఐదవ వారంలోకి ప్రవేశించిన, ముగింపు కనిపించని సైనిక దాడి

ప్రపంచవ్యాప్తంగా అణు పోటీ అనే భూతాన్ని చెరవిముక్తి చేసినట్లుగా కనిపిస్తున్నది. పాలన మార్పు, అణు కార్యక్రమం ముగింపును తెచ్చే ఉద్దేశంతో ఇరాన్‌పై జరిగిన దాడులు యూరప్ నుంచి తూర్పు ఆసియా వరకు అన్ని దేశాలు ఇప్పుడు తమ అణు విధానంపై పునరాలోచించే పరిస్థితిని కల్పించాయి. శక్తివంతమైన మిత్రదేశాలపై ఆధారపడే బదులు సొంతంగా అణ్వాయుధాలు నిర్మించుకోవాలని చాలా దేశాలు యోచిస్తున్నాయి.

ఒకప్పుడు అమెరికా అణు ఛత్రం కింద తాము సురక్షితమని భావించిన దేశాలు ఇప్పుడు అధ్యక్షుడు ట్రంప్ పాలనలో అమెరికా తీసుకునే నిర్ణయాలు అనూహ్యంగా ఉన్న నేపథ్యంలో సొంత ప్రత్యామ్నాయాలపైనే ఆధారపడేందుకు మొగ్గుచూపుతున్నాయి. అణ్వాయుధాల దాడికి గురైన ఏకైక దేశమైన శాంతికాముక జపాన్ సైతం ఇప్పుడు సొంతంగా అణ్వాయుధాల నిర్మాణం గురించి ఆలోచిస్తున్నది. చైనా, రష్యాతో పోటీపడాలని అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన ఆదేశాలతో 33 ఏండ్ల విరామం తర్వాత తాను కూడా అణు పరీక్ష పునరుద్ధరించాలన్న ఆసక్తిని గత నవంబర్‌లో అమెరికా వ్యక్తం చేసింది.

ఇరాన్ యుద్ధంతో ఆందోళనలు

ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించుకుంటే తాము కూడా అణ్వాయుధ సామర్థ్యాన్ని సాధిస్తామని సౌదీ అధికారులు చాలాకాలంగా చెబుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో పాక్, సౌదీ ఓ రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. తమ అణ్వాయుధాలు అవసరమైతే సౌదీకి కూడా అందుబాటులో ఉంటాయని పాక్ ఆ తర్వాత ప్రకటించింది. మరో పక్క నాటో సభ్య దేశమైన తుర్కియే తన సొంత అణు నిరోధక శక్తి కోసం అన్వేషిస్తున్నది. ఇరాన్ మరింత బలపడితే ఈ ప్రాంతంలోని అధికార సమతుల్యతను దెబ్బతీస్తుందన్న భయమే తుర్కియే ఆందోళనకు కారణం. లిబియా, ఉక్రెయిన్ విషయంలో చూసినట్లుగా అణ్వాయుధ కవచం లేని దేశాలు దాడుల నుంచి అధిక ప్రమాదాన్ని ఎలా ఎదుర్కొంటాయో ఇరాన్‌పై జరిగిన దాడి తెలియచేస్తుంది. అణ్వాయుధాలు కలిగి ఉండటం ఇంటి గేటు దగ్గర ఒక డాబర్‌మాన్ శునకాన్ని కాపలాగా ఉంచుకోవడం లాంటిది. చొరబాటుదారులను భయపెట్టి తరిమివేయడానికి అది బాగా పనిచేస్తుంది. అణ్వాయుధాల నిల్వలను కలిగి ఉన్న ఉత్తర కొరియా సరిగ్గా ఇదే కారణంతో బాహ్య జోక్యాన్ని చాలా వరకు నిరోధించగలిగిందని నిపుణులు తెలిపారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ పగ

మొదటి తరువాయి

వదలాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కాళేశ్వరంపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన వ్యాఖ్యలు రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న భాషలాగే ఉన్నాయనీ, బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు కాంగ్రెస్, బీజేపీల ఫెవికాల్ బంధం బయటపడిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.90 వేల కోట్లు, రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి ఎలా మాట్లాడటం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులిచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని చెప్పారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం 2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాల్లో ఉన్న సాగు విస్తీర్ణం 2023 నాటికి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని వివరించారు. భువనగిరి జిల్లాలో ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు కాలువలకు వెళ్లి నీళ్లు వదులుతున్నారనీ,అవి కాళేశ్వరం నీళ్లు కావా?అని ప్రశ్నించారు. గంధమల్ల ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారనీ, అది కాళేశ్వరంలో భాగం కాదా? అని అడిగారు. హైదరాబాద్‌కు తాగునీటి కోసం మూసీ పక్కనుంచి 20 టీఎంసీల నీళు తేవడం కోసం రూ.ఎనిమిది వేల కోట్లతో కాలువలు తవ్వుతున్నారనీ, మల్లన్న సాగర్ నుంచి ఆ నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. భువనగిరి, చౌప్పదండి, జగిత్యాల, సిద్ధిపేట, దుబ్బాక, గజ్వేల్, మెదక్, నర్సాపూర్ వెళ్లి సాగునీటిని, పంటలను చూద్దామనీ, నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో రైతులను అడుగుదామని కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, కిషన్‌రెడ్డి, బండి సంజరుతోపాటు కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. రూ.50 కోట్లు విడుదల చేస్తే కొత్తగా రెండు లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులివ్వకుండా పగబట్టిందని విమర్శించారు.

## ఉచిత బస్సుతో మహిళలకు మేలు

మొదటి తరువాయి

పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి.. దాదాపు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళా ప్రయాణికులను కేవలం ప్రయాణికులుగా మాత్రమే కాకుండా, వారిని ఆర్టీసీకి యజమానులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికుల్లో 40 లక్షల మంది మహిళలే ఉంటున్నారని.. 97 డిపోల పరిధిలో రోజూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఈ భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ఆయన ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాఖీ వంటి పండుగ దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించిన కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారని, యూనియన్ల పేరుతో రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణకు ఆర్టీసీయే లైఫ్ లైన్ అని ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ అగ్రస్థానంలో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీని రాష్ట్రంలోని ప్రతి మూలకు చేర్చేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా కొత్త రూట్లు, కొత్త బస్సులు , బస్ స్టేషన్ల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 340 కొత్త రూట్లలో బస్సులను ప్రారంభించామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమంపై స్పందిస్తూ.. బకాయిలను తీరుస్తున్నామని, యూనియన్ల ఏర్పాటు, ఆర్టీసీ విలీనం అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు.

## నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

మొదటి తరువాయి

విశ్వాసం వ్యక్తం చేశారు. రైతులు నమ్మకంతోనే.. రాజధానికి భూములు ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులను కేంద్రం అర్థం చేసుకుందని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం రాజధానిని అడ్డుకోవాలని చూసిందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి రాజధానికి 30 వేల ఎకరాలని.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మాట మార్చారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ ఇప్పుడు అసెంబ్లీకి వచ్చినా? రాకున్నా రాష్ట్ర ప్రజలు పట్టించుకోరని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్కొన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలకు రాజధానిపై అసలు స్పష్టత లేదని విమర్శించారు. రాజధాని అమరావతికి తాము వ్యతిరేకం కాదని వైసీపీకి చెందిన సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన విషయాన్ని ఎంపీ లావు గుర్తు చేశారు. వైసీపీ నేతలు ఒక్కొక్కరు ఒక్కో విధంగా రాజధానిపై మాట్లాడుతున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు మాట ఇచ్చారని.. ఇప్పుడు దానిని నిలబెట్టుకున్నారని వివరించారు. ఏపీ పునర్విభజన చట్టంపై తాను పార్లమెంట్‌లో ఇప్పటి వరకు 20 సార్లకు పైగా మాట్లాడానని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు గుర్తు చేశారు. లోక్ సభకు రాజధాని అమరావతి బిల్లు రాబోతుందని.. ఇది ఒక ఆంధ్రుడిగా తనకు గర్వంగా ఉందని విజయనగరం ఎంపీ కె. అప్పలనాయుడు తెలిపారు. అమరావతి రాజధానిగా ఉండాలని 30 వేల ఎకరాల భూములను రైతులు ఇచ్చారని వివరించారు. 2014లో సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు ఇస్తే రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని చెప్పారు. దేశంలో ఎక్కడ ఇలా జరగలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూసేకరణ చంద్రబాబు నాయుడు హయాంలోనే జరిగిందని.. రాజధాని సైతం వారి హయంలోనే గుర్తిస్తున్నారని ఎంపీ అప్పలనాయుడు వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో కుట్రలు చేశారని విమర్శించారు. వైసీపీ నేతలు సైతం రాజధాని నిర్మాణం జరగకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది చెంపపెట్టు అన్నారు. రాజధాని అమరావతిపై జగన్ తన వక్రబుద్ధి చూపించారని చెప్పారు. అమరావతి బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపిందన్నారు.

# సంపాదకీయం

## ఈ దోపిడీకి కళ్లెమెప్పుడు?




మరో రెండున్నర నెలల్లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఫీజులు ఎలా ఉంటాయన్న ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో మొదలైంది. ఇప్పటికే ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో ఫీజులు పెంచుతున్న సంకేతాలు యాజమాన్యాల నుంచి తల్లిదండ్రులకు అందాయి. పరిస్థితులు ఎలా ఉన్నా యాజమాన్యాలు ఏడాదికోసారి 20 నుంచి 30 శాతం ఫీజులు పెంచేస్తున్నాయి. నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఫీజుల భారం లేకుండా చేస్తామని గత సర్కార్ కమిటీల పేరిట సాగదీసింది. ప్రస్తుత ప్రభుత్వం గద్దెనెక్కి రెండేం డ్లు దాటినా ఫీజుల దోపిడీని అరికట్టలేకపోయింది. ఇది వచ్చే విద్యాసంవత్సరానికైనా అమల్లోకి వస్తుందా అన్నది సంశయంగానే ఉంది. దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. రాష్ట్రంలో విద్యా సంవత్సరం అంటే ఫీజుల దోపిడీ అన్నట్టుగా మారింది. ఇంజినీరింగ్ విద్యకు అత్యధిక వార్షిక ట్యూషన్ ఫీజు రూ. 1.83 లక్షలు. అదే పాఠశాల విషయానికి వస్తే కార్పొరేట్ స్కూళ్లలో రూ. 5 లక్షలు! పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన ఓ పాఠ శాల కొద్దిరోజుల క్రితం పాఠ్యపుస్తకాల ధరలను రూ. 18 వేలకు పెంచింది. అలాగే పేరొందిన ప్రముఖ విద్యా సంస్థలు ఆరో తరగతి ఫీజును అమాంతం 30 వేల రూపాయలు అదనంగా పెంచాయి! దీన్ని సాకుగా చూపెడుతూ కొన్ని యాజమాన్యాలు 'మా దగ్గర ఫీజు తక్కువగా ఉంది. బయట చూడండి మీకే తెలుస్తుంది' అంటూ ఏదో తక్కువ చేస్తున్నట్టు నటిస్తూ అందినకాడికి దండుకుంటు న్నాయి. ఇలాగైతే సామాన్యుల పిల్లలకు విద్య అందేనా? ఈ దోపిడీకి కళ్లెమెప్పుడు? ఈ ప్రశ్నే తల్లిదండ్రుల గుండెలో ఇప్పుడు ఒక ఆందోళనగా ఉంటోంది. ఇంత బహిరంగంగా ఫీజుల్ని పెంచుతుంటే, ప్రభుత్వ పెద్దల కట్టడి చేసే చర్యలు మాటలకే పరిమితం కావడం శోచనీయం. ప్రభుత్వం ఏడాది క్రితమే ఫీజుల నియంత్రణకు చట్టం తెచ్చేందుకు బిల్లు నమూనా సిద్ధమైనప్పటికీ, దానిపై ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అనేక అంశాలపై బిల్లులు ఆమోదం పొందినా ఫీజుల బిల్లును మాత్రం ఆమోదానికి పెట్ట లేదు. దీని వెనుక అంతర్య మేంటి? వ్యక్తిగత అంశాలపై సవాల్ విసురు కునేందుకు సమయం కేటాయించిన అధికార, ప్రధాన ప్రతిపక్షసభ్యులు లక్షల మందికి ఉపయోగపడే బిల్లు గురించి ఎందుకు మాటాడలేదు? కావాలనే పక్కన పడేశారా అన చర్చ ఇప్పుడు నడుస్తోంది. దీనికి జవాబు పాలకులే చెప్పాలి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని 2022 జనవరి 17న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆనాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ, ఆచరణలో అడుగు కూడా ముందుకు పడలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రస్తుత సర్కార్ రుసుములను కట్టడి వేసేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని 2024 సెప్టెంబర్‌లో ప్రకటించింది. రాష్ట్ర విద్యాకమిషన్ కూడా దీనికోసం చట్టం తీసుకురావాలని స్పష్టంగా సిఫార్సు చేసింది. అయినప్పటికీ అమల్లోకి రాకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఒకవైపు విద్య వంటి ప్రాథమిక హక్కు విషయంలో ఇలా ఆలస్యం చేయడం అనేక అనార్థాలకు దారితీస్తుందని మేధావులు, విద్యావేత్తల అభిప్రాయం. ఇంకోవైపు, "అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్య" అనే నినాదం ప్రజలను ఆకర్షించేలా ఉన్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు దానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి స్థాయిలో విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామనే ప్రకటనలు వినిపిస్తున్నాయి. "యంగ్ ఇండియా" వంటి పేర్లతో కొత్త ప్రభుత్వ పాఠశాలల ప్రచారం జరగడం ఒకవైపు ఆశాజనకంగా కనిపించినా, టెక్నో, గ్లోబల్, ఒలింపియాడ్ వంటి పేర్లతో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో దోచుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ ఫీజులు పెంచుకునేందుకు పాలకవర్గాలే అవకాశం కల్పిస్తున్నాయి. కొన్ని పాఠశాలలు అదనపు ఫీజులు, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో మరింత భారాన్ని మోపుతు న్నాయి. దీనివల్ల మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విద్యను వ్యాపారంగా మార్చే ధోరణి పెరుగుతున్నప్పుడు, ప్రభుత్వ నియంత్రణ ఉండాలి.కానీ, లేకపోవడం బాధాకరం. విద్య అనేది లాభాపేక్షతో నడిచే రంగం కాకూడదు. అది సమాజ అభివృద్ధికి పునాది. అందరికీ సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. దీన్ని నిర్వర్తించడంలో ఆలస్యం చేయడమంటే భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టినట్టే. ఇలాంటి పరిస్థితుల్లో మాటలు కాకుండా చర్యలు అవసరం. ఇప్పటికైనా ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురా వాలి. ఆ చట్టంలో ప్రతి పాఠశాల ఫీజుల నిర్మాణం పారదర్శ కంగా ఉండేలా నిబంధనలు పెట్టాలి. నియంత్రణ సంస్థను ఏర్పాటు చేసి, ఫీజుల పెంపుపై పర్యవేక్షణ చేయాలి. ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచి, ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయమివ్వాలి.

# సెంబ్లీ సమావేశాల్లో బిసి సబ్ ప్లాన్ కు చట్టబద్ధత కల్పించాలి.

**సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్.**

**దేవరకొండ మార్చి 31( మహాప్రభ)**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహం ముందు బీసీ సంక్షేమ సంఘం నాయకులు జరిగేటటువంటి అసెంబ్లీ సమావేశాలు బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి చట్టబద్ధ కల్పించాలని నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా తాము



అధికారంలోకి రాగానే మహాత్మ జ్యోతిబాపూలే పేరుతో బీసీ సబ్ ప్లాన్ చట్టం చేస్తామని ప్రతి ఆర్థిక సంవత్సరంలో బీసీల సంక్షేమానికి 20వేల కోట్ల రూపాయలు కేటాయించి ఐదు సంవత్సరాలకు గాను ఒక లక్ష కోట్లు బీసీల అభివృద్ధికి ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారని కానీ అమలుకు నోచుకోలేదని అన్నారు. బడ్జెట్లో జనాభా ప్రాతిపదికన కాకుండా 3.8% కేటాయింపులు చేసి అందులో అర శాతానికి తక్కువ ఖర్చు చేస్తునట్లు గణాంకాలు సూచిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో బీసీ సబ్ ప్లాన్ కు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పున్న వెంకటేష్ నేత,పున్న బిక్షమయ్య, జక్కుల అంజి యాదవ్,బొమ్ము శ్రీనివాస్ యాదవ్, పొలమోని శేఖర్ గౌడ్, నట్వా సుధాకర్,చెరుకు అంజి గౌడ్,వెంకట్, శివ తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం విజయవంతం

**-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా వెయ్యి కోట్ల రూపాయలు ఆదా**
**- ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలునాయక్**

**దేవరకొండ మార్చి 31( మహాప్రభ)**

ప్రజాపాలన ప్రగతి పథం అనే నినాదంతో ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించి వెయ్యి కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా మంగళవారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ - దేవరకొండ వారి ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలునాయక్.అనంతరం సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వారం రోజుల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ



పథకం ద్వారా మహిళలు ఆర్థిక భారం లేకుండా స్వేచ్ఛగా ప్రయాణిస్తూ, తమ దైనందిన అవసరాలను సులభంగా నిర్వహించుకుంటున్నారని పేర్కొన్నారు.మహిళల సాధికారత దిశగా ఇది ఒక కీలకమైన అడుగు అని, ఈ పథకం వల్ల మహిళల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా, వారి జీవన ప్రమాణాలు కూడా పెరుగుతున్నాయని ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు ప్రయాణించే మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా మారిందని అన్నారు.ఇకపై కూడా ప్రజల సంక్షేమానికి కట్టుబడి ప్రభుత్వం అనేక



పథకాలను అమలు చేస్తుందని, ప్రతి మహిళ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.అనంతరం ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందిన మహిళలను ఆయన శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేష్, మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, ఆర్.ఏం (ఏం) నల్లగొండ భీంరెడ్డి, డీఎం విజయ కుమారి, వార్డు కౌన్సిలర్ గాజుల సావిత్రి, ఆర్టీసీ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు అండగా ఎమ్మెల్యే బాలునాయక్:

## మృతుల కుటుంబాలకు పరామర్శ

**దేవరకొండ మార్చి 31( మహాప్రభ )**

దేవరకొండ నియోజకవర్గం వ్యాప్తంగా ఇటీవల చోటుచేసుకున్న విషాదకరమైన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలునాయక్ మంగళవారం పరామర్శించారు.నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల విషయం తెలిసిన వెంటనే ఆయన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని పోస్టుమార్టం కోసం ఉంచిన మృతదేహాలకు నివాళులు అర్పిస్తూ..., వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఈ కఠిన సమయంలో తాము ఒంటరిగా





లేరని వారికి ధైర్యం చెప్పి, ప్రభుత్వం వారి వెంటే ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్లు, పోలీసు అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రమాదాలకు గల కారణాలను సమగ్రంగా పరిశీలించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని, వారికి అవసరమైన సహాయం అందించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పాలిత ప్రాంతాలలో మహిళలకు రక్షణ లేదు.

**మహిళా కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ పడిగే స్వరూప మెదక్ కనస్టేన్సీ, మెదక్ జిల్లా.**

**మెదక్ జిల్లా మార్చి 31( మహాప్రభ)**

ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ మరియు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణక్క ఆదేశాల మేరకు మంగళ వారం రాష్ట్ర కాంగ్రెస్ మహిళా జనరల్ సెక్రెటరీ పడిగే స్వరూప మెదక్ పట్టణంలో ని ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పడిగే స్వరూప మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ పాలిత ప్రాంతాల లోనే మహిళలకు మరియు బాలికలకు రక్షణ కరువైంది అన్నారు. బిజెపి కి చెందిన 44 మంది ఎంపీలు మరియు ఎమ్మెల్యేలు మహిళల పైన అత్యాచార లైంగిక వేధింపుల కేసులో ఉన్నారని వారు అన్నారు. ఈ విషయంలో బిజెపి ప్రభుత్వంలోని మహిళా మంత్రులు కూడా ఎందుకు మౌనంగా ఉన్నారని వారు అన్నారు. ఈ బీజేపీ మోదీ ప్రభుత్వ పాలనలో జరిగిన కొన్ని దాడులను గురించి ఈ సందర్భంగా మీడియా ముందుకు తీసుకువచ్చారు. అవి జఫ్రీ ఎస్టీమ్స్ ఫైల్స్ లో ప్రధాని మోదీ, అంబానీ,



కేంద్ర పెట్రోలియం మంత్రి అర్దీప్ సింగ్ పూరి పేర్లు ఉండటం మన దేశ దౌర్భాగ్యం అన్నారు. గోవాలో బిజెపి కౌన్సిలర్ కొడుకు బాలికలను అత్యాచారానికి గురిచేసిన కేసు, మహారాష్ట్రలో 58 మంది మహిళలను అత్యాచారానికి గురిచేసిన అశోక్ కరత్ కేసు. ఉత్తరాఖండ్ అంకిత బండారి హత్య కేసు. ఉన్నావ్ అత్యాచార కేసు . హిమాచల్ ప్రదేశ్ లో ఒక ఎమ్మెల్యే మైనర్ బాలికపై హత్యాచారానికి పాల్పడిన కేసు. హర్యానా మహిళ కోచ్ ను వేధింపులకు గురిచేసిన సందీప్ సింగ్, అలాగే కుల్దీప్ సింగ్. ఇలా ఎన్నో ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల పైన వెంటనే చట్టపరమైన చర్యలను తీసుకోవాలని మా మహిళా కాంగ్రెస్ తరపున డిమాండ్ చేస్తున్నాము అని అన్నారు. బేటి పడావో బేటి బచావో అన్న మోదీ మీ పాలనలో మహిళలకు మరియు బాలికలకు రక్షణ ఎక్కడ ఉంది అని నిలదీశారు. ఇప్పటికైనా మోడీ చిత్తశుద్ధి ఉన్నట్లయితే ముందు బాధితులకు న్యాయం చేయాల్సిందిగా వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులకు న్యాయం దొరికే వరకు దేశవ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ తరపున మా పోరాటం మల్కాజి గిరి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనం పల్లి హన్మంత రావు,మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ రావు, డి సి సి ప్రెసిడెంట్ ఆంజనేయులు గౌడ్ ల సహకారంతో పోరాటం కొనసాగుతూనే ఉంటుంది వారు అని హెచ్చరించారు.

## కొండమల్లేపల్లిలో నీటి సమస్య పరిష్కారం

- సర్పంచ్ యుగంధర్ రెడ్డి చొరవ



**దేవరకొండ ( డివిజన్ ) 31 మార్చి మహాప్రభ**

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలో దేవరకొండ రోడ్డు పోస్ట్ ఆఫీస్ దగ్గర 6 వార్డులో వాటర్ సమస్య తలెత్తడంతో వార్డు నెంబర్ ఊరే నరేష్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సర్పంచ్ యుగంధర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పోస్ట్ ఆఫీస్ వద్ద వాటర్ సమస్య ఉంది అని చెప్పగానే స్పందించి నా సర్పంచి వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడొద్దు అని వెంటనే పాత బోరుని మరమ్మతులు చేయించి అక్కడ ఉన్న వార్డు ప్రజలకు తాగునీరు అందించి సమస్యని పరిష్కరించిన సర్పంచికి వార్డు నెంబర్ కి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్స్ ఊరే నరేష్ లింగం కొండల్ మల్లేష్ రాఘవేందర్ అంజి కాలినివాసులు పాల్గొన్నారు.

## చందంపేటను అసెంబ్లీ కేంద్రంగా ఏర్పాటు చేయాలి

-బోడ శ్రీశైలం యాదవ్ బీజేపీ



బోడ శ్రీశైలం యాదవ్

**దేవరకొండ (డివిజన్ రిపోర్టర్ ) మార్చి 31( మహాప్రభ)**

చందంపేట 2027 డిలిమిటేషన్లో భాగంగా చందంపేట మండలంలోని తెలదేవరపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేస్తూ దానితోపాటుగా సిద్ధాపూర్ మండలాన్ని, డిండి మండలాన్ని, చెరుకుపల్లి మండలాన్ని, నేరడు కొమ్ము మండలాన్ని కలుపుతూ చందంపేటను నూతన అసెంబ్లీగా ఏర్పాటు చేయాలని,అదే విధంగా దేవరకొండ కేంద్రంగా లోకసభ స్థానంగా ఏర్పాటు చేయాలని చందంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు.

## కోర్ర తండాలో తాగునీటి కష్టాలు

-అధికారుల నిర్లక్ష్యంపై జనసేన నేత చందు నాయక్ ఆగ్రహం





**దేవరకొండ (డివిజన్ రిపోర్టర్ ) మార్చి 31( మహాప్రభ)**

దేవరకొండ పట్టణం కోర్ర తండా గ్రామపంచాయతీ ప్రజలకు మిషన్ భగీరథ నీళ్లు రాక అవస్థలు పడుతున్న కొర్ర తండ ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు నెల కిందట పైపులు పగిలిపోయాయని చెప్పడం జరిగింది గ్రామ సర్పంచి మాట కూడా వినని అధికారులు ఈ విషయం జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోర్ర చందు నాయక్ తెలియజేయగానే స్పందించి వెంటనే ఎంపీడీవోకు ఫిర్యాదు ఇవ్వగా మిషన్ భగీరథ నీళ్లు అతి త్వరలో అందిస్తామని చెప్పడం జరిగింది కానీ ఇప్పటికి వారం గడిచిన మిషన్ భగీరథ నీళ్లు అందక అవస్థలు పడుతున్న ప్రజలు వెంటనే అధికారులు ఈ విషయంపై స్పందించి సమస్యని పరిష్కరించకపోతే గ్రామ ప్రజలు వందల మందితో బిందెలు తీసుకొచ్చి రోడ్డుపైన ధర్నా నిరసన నిర్వహించాల్సి వస్తుందని అధికారులకు చందు నాయక్ హెచ్చరించారు.

## పాపన్న వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**కామారెడ్డి, మార్చి 31: (మహాప్రభ)**

చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి వారోత్సవాలను ఏప్రిల్ 2న ఘనంగా నిర్వహించాలని జై గౌడ్ ఉద్యమం జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపన్న గౌడ్, అణగారిన వర్గాల విముక్తి కోసం పోరాడిన మహానుభావుడని కొనియాడారు.ముగల్ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలపై జరిగిన దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా సర్దార్ పాపన్న ప్రజలను ఏకం చేసి తిరుగుబాటు ప్రారంభించారని తెలిపారు. సామ్రాజ్యవాద శక్తులపై యుద్ధం చేసి పేద ప్రజలకు స్వేచ్ఛను సాధించారని గుర్తుచేశారు. గోల్కొండ కోటను ఏలిన చక్రవర్తిగా,పాపన్న చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. గౌడ జాతిలో జన్మించి, అన్ని అణగారిన వర్గాల కోసం ప్రాణత్యాగం చేసిన పాపన్న వర్ధంతిని గ్రామ, గ్రామాన, ఘనంగా జరుపుకోవాలని కోరారు. గ్రామాల్లో ఉన్న పాపన్న, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని, విగ్రహాలు లేని చోట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి స్మరణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాపన్న గౌడ్, ఆశయాలను కొనసాగిస్తూ బహుజనులంతా ఏకమై ముందుకు సాగాలని రంగోల్ల మురళి గౌడ్, పిలుపునిచ్చారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శి ఉపాధ్యాయులు








### ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**దేవరకొండ (డివిజన్ రిపోర్టర్ ) మార్చి 31( మహాప్రభ)**

38 సంవత్సరాలపాటు ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో సేవలందించి నేడు దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న శ్రీమతి రెబెకా సదానందం గారిని గౌరవప్రదంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలునాయక్. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... అట్టడుగు వర్గాల నుండి విద్యను ఆయుధంగా తీసుకుని ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన శ్రీమతి రెబెకా సదానందం గారు మూడు దశాబ్దాలకు పైగా




కాలం పాటు అపారమైన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావంతో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన మహనీయురాలని కొనియాడారు. గ్రామీణ ప్రాంత బాలికలకు విద్యా ప్రాధాన్యతను చాటి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని ఆయన అభినందించారు.ఇలాంటి అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శమని, వారి సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తూ, ఉపాధ్యాయుల పాత్రను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు.అనంతరం శ్రీమతి రెబెకా సదానందం గారికి పుష్ప గుచ్ఛం అందించి, శాలువాలతో సన్మానం చేసి, విశ్రాంత జీవితం ఆరోగ్యకరంగా, సుఖ శాంతియుతంగా కొనసాగాలని ఆయన కాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీమతి పున్న శైలజ వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ ఆలంపల్లి నర్సింహ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ నాయిని జమునా మాధవరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, వార్డు కౌన్సిలర్ గాజుల సావిత్రి మురళి, ఎంఇఓ మాతృ నాయక్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లు జాబిత "ప్రత్యేక సమగ్ర సర్వే" కోసం జిల్లా స్థాయి కార్యశాల

**-ఓటర్లు జాబితా తప్పుల సవరణలో బీజేపీ కార్యకర్తలు**
**-రేపటి నుంచే ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితా పరిశీలన**
**-కోలా ఆనంద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు**

**మార్చ్ 31 తిరుపతి జిల్లా (శ్రీకాళహస్తి) మహాప్రభ**

నాయుడుపేటలో శ్రీకాళహస్తి రోడ్డులోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ నందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) తిరుపతి జిల్లా కార్యశాలను అత్యంత వైభవంగా జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ గారి అధ్యక్షతన విజయవంతంగా నిర్వహించడం జరిగినది. ఓటరు జాబితా సవరణలో పారదర్శకతను పెంపొందించే దిశగా క్షేత్రస్థాయిలో బీజేపీ కార్యకర్తలను "బీ ఎల్ ఓ.లుగా మరియు బీ ఎల్ ఏ".లుగా నియమించుకుని అధికారులను సమన్వయం చేసుకుంటూ తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించడంపై నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను కూడా బీజేపీ కార్యకర్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో



బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీ మట్టా ప్రసాద్ గారు, శ్రీ సన్నారెడ్డి దయాకర్ రెడ్డి గారు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ గారు, మాజీ పార్లమెంట్ సభ్యులు వరప్రసాద్ గారు, రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ గారు, తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు చంద్రప్ప గారు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బీడి బాలాజీ, కె. నరేష్, మునికృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా మోర్చా అధ్యక్షులు కునాటి నాగరాజు, ప్రజ్ఞాశ్రీ, జీపాలెం తేజోవతి, మండల అధ్యక్షులు ఆర్. హరీష్ రెడ్డి, పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, వేడం కృష్ణయ్య, బాగీత్ వెంకటేష్, తిరుమలశెట్టి నరేష్, మండల ఇంచార్జీలు, జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, మాజీ రాష్ట్ర కిషన్ మోర్చా నాయకులు కుప్ప ప్రసాద్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనారు.

# బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా అంబటి బాలేష్ గౌడ్

**దుబ్బాక మార్చి 31 (మహాప్రభ):**

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా దుబ్బాకకు చెందిన సంజన అంబటి బాలేష్ గౌడ్ ను మరోసారి నియమిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్, రామచంద్రారావు ఉత్తర్వులు జారీ చేశారు. బాలేష్ గౌడ్ ను రాష్ట్ర పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించడం ఇది మూడోసారి గతంలో బండి సంజయ్ గారు, తర్వాత కిషన్ రెడ్డి గారు రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న సమయంలో కూడా రెండుసార్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పని చేశారు. ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామ్ చంద్రారావు కూడా మూడోసారి కార్యవర్గ సభ్యులుగా నియమించారు. చిన్నప్పటినుండి ఆరెస్సెస్, ఏబీవీపీ లలో చురుకుగా పనిచేసిన బాలేష్ గౌడ్ పార్టీలో అంచలంచలుగా ఎదుగుతూ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు స్థాయికి చేరుకున్నారు. 2000 సంవత్సరంలో బిజెపి దుబ్బాక పట్టణ అధ్యక్షులుగా పార్టీలో తన ప్రస్థానాన్ని ప్రారంభించి మండల బీజేవైఎం అధ్యక్షులుగా , బిజెపి దుబ్బాక నియోజకవర్గం ప్రచార కార్యదర్శిగా, బిజెపి దుబ్బాక





అసెంబ్లీ కన్వీనర్ గా, రెండుసార్లు పనిచేశారు. తర్వాత బిజెపి ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు , అనంతరం రెండుసార్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పని చేసిన బాలిష్ గౌడ్ ను మళ్లీ మూడోసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించారు గత 26 సంవత్సరాల నుండి పార్టీలో బాధ్యతలు లేకుండా ఎనాడు కూడా లేరు. బాలేష్ గౌడ్ ను రాష్ట్ర పార్టీ గతంలో హుజురాబాద్, మునుగోడు , ఉప ఎన్నికలకు ఇన్చార్జిగా నెలల రోజులపాటు పంపించింది. తర్వాత నారాయణఖేడ్ నియోజకవర్గానికి కూడా పార్టీ సంస్థగత నిర్మాణం కోసం కూడా పనిచేశారు. గత సంవత్సరం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలకు వేములవాడ నియోజకవర్గానికి ఇన్చార్జిగా పనిచేశారు. పార్టీ అప్పగించిన పనిని శక్తివంచన లేకుండా నిర్వహిస్తారని బాలేష్ గౌడ్ కు పేరు ఉంది. ఈ సందర్భంగా బాలేష్ గౌడ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను మరోసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించినందుకు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడతానని రాబోయే 2028 ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని అన్నారు. తనని నియమించిన రాష్ట్ర అధ్యక్షులు ఎన్, రామచంద్రరావు గారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

# మాజీ కౌన్సిలర్ యాదగిరి సతీమణికి కాలు ఫ్యాక్చర్

**పరామర్శించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

**దుబ్బాక మార్చి 31 (మహాప్రభ):**

దుబ్బాక మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆస యాదగిరి వారి సతీమణి ఇటీవల కాలు ఫ్రాక్చర్ అయిన విషయం తెలుసుకొని వారిని పరామర్శించిన దుబ్బాక





శాసన సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి వారితో పాటు దుబ్బాక మున్సిపల్ కౌన్సిలర్ మూర్తి సంధ్య శ్రీనివాసరెడ్డి, వనం రమేష్, బి ఆర్ ఎస్ నాయకులు కొత్త కిషన్ రెడ్డి, పి ఎస్ సి చైర్మన్ కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి ర్యాలీ మార్గాన్ని స్వయంగా
# పరిశీలించిన జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ





**-ర్యాలీ రూట్ మ్యాప్ పరిశీలన..**
**అధికారులకు కీలక ఆదేశాలు**
**-శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని విజ్ఞప్తి**

**కామారెడ్డి జిల్లా మార్చి 31 (మహాప్రభ)**
ఏప్రిల్ 02న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కామారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న శోభాయాత్ర మార్గాన్ని, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, IAS మరియు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, IPS మంగళవారం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు. ర్యాలీ సజావుగా, శాంతియుత వాతావరణంలో జరిగేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో చర్చించి పలు కీలక సూచనలు చేశారు. వివిధ శాఖల అధికారులతో కలిసి ర్యాలీ సాగే రూట్ మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్ మరియు ఎస్పీ, మార్గంలోని ప్రధాన కూడళ్లను సందర్శించి ట్రాఫిక్ నియంత్రణ మరియు బందోబస్తు ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. ర్యాలీ నిర్వహణ ప్రతినిధులతో కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వేడుకలను క్రమశిక్షణతో జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పట్టణంలోని ముఖ్య మార్గాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలు మరియు సీసీటీవీల ద్వారా నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా భక్తులు మరియు నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి ఈ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, IPS, కామారెడ్డి ఎస్.హెచ్.ఓ నరహరి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్ మరియు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం సహాయనిది చెక్కులను పంపిణీ

-మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి



**శివంపేట, మార్చి 30 (మహాప్రభ)**
శివంపేట్ మండలం తుక్య తండాకు చెందిన సభావత్ సాలమ్మ గారికి 28,000 రూపాయలు మరియు చిలప్చెడ్ మండలం ఫైజాబాద్ గ్రామానికి చెందిన విస్లావత్ దాల్సి గారికి 60,000 రూపాయలు మొత్తం 88000 రూపాయల సీఎం సహాయ నిధిని మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సుహాసిని రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యం, ప్రమాదాలు తదితర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా మారిందని వైద్య చికిత్సల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయలేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలబడటం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యేకత అని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ ,శివంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్ ,సీనియర్ నాయకులు, శ్రీశైలం యాదవ్ , రాధా కృష్ణ ,కొండి దుర్గేష్,తుల్జారాం పేట్ సర్పంచ్ కిషన్ నాయక్,సుదీర్ గౌడ్, దాడిగే నరేష్, ఫైజాబాద్ శ్రీనివాస్ రెడ్డి,నాగేందర్,శివాజీ, రాజు, చందు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలి

**కామారెడ్డి, మార్చి 31(మహాప్రభ)**
పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించిన ముగ్గురు అధికారులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో పదవీ విరమణ, పొందిన అధికారులను సత్కరించారు. ఎస్ఐలుగా పనిచేసిన యం. ప్రకాష్ (బాన్సువాడ), యం. రాజయ్య, (వి.ఆర్. కామారెడ్డి), ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ యం. నారాయణ,లను వారి కుటుంబ సభ్యులతో సహా ఆహ్వానించి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. నరసింహ రెడ్డి, మాట్లాడుతూ, 40--42 సంవత్సరాలపాటు క్రమశిక్షణతో,



అంకితభావంతో సేవలందించిన అధికారులను అభినందించారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకుని, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని సూచించారు. నిత్య వ్యాయామం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. రిటైర్మెంట్ అనంతరం అందవలసిన అన్ని ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు వచ్చినా పోలీసు శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వారి సేవలు పోలీసు శాఖలో చిరస్మరణీయమని కొనియాడారు. వివరాల ప్రకారం, యం. ప్రకాష్, యం. రాజయ్యలు 1984లో కానిస్టేబుల్‌లుగా సేవలు ప్రారంభించి సుమారు 42 సంవత్సరాలు పనిచేసి పదవీ విరమణ పొందగా, యం. నారాయణ 1985లో చేరి 41 సంవత్సరాల సేవ అనంతరం రిటైర్ అయ్యారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఆర్ఐలు నవీన్ కుమార్, కృష్ణ, సంతోష్ కుమార్, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# యాదాద్రిలో గిరిప్రదక్షిణ చేసిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి..



**మెదక్ జిల్లా మార్చి 31 (మహాప్రభ):**
యాదాద్రి భువనగిరి జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి గిరిప్రదక్షిణ నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆమెతో పాటు కరీంనగర్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ తుల. ఉమా,ఆలేరు మాజీ ఎమ్మెల్యే సునీత, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ చేసిన అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యే పూజలు చేసి మొక్కులు చెల్లించారు.ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతుండగా, పద్మ దేవేందర్ రెడ్డి సాధారణ భక్తుల్లా గిరిప్రదక్షిణలో పాల్గొని తన ఆధ్యాత్మిక భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమయానికి వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. రాష్ట్రంలో శాంతి, అభివృద్ధి నెలకొనాలని ప్రార్థించినట్లు తెలిపారు.యాదాద్రి క్షేత్రం బిఆర్ఎస్ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అభివృద్ధి చెంది దేశవ్యాప్తంగా ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా మారిందని పేర్కొన్నారు.

# కులం పేరుతో దూషణ, బెదిరింపు ల కేసులో ముగ్గురికి జైలు శిక్ష

**-బెదిరింపుల కేసులో ముగ్గురు నిందితులకు 1 సంవత్సరం జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 4,500 జరిమానా విధింపు**
**-కుల దూషణలు, బెదిరింపులకు పాల్పడితే జైలు శిక్ష ఖాయం**
**-పటిష్టమైన సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్ష పడేలా చేసిన అధికారులకు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, IPS అభినందనలు**

**కామారెడ్డి మార్చి 31 (మహాప్రభ):**
నేటి సమాజంలో కులం పేరుతో వివక్ష చూపడం, వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీయడం అక్షరాలా నేరమని, అటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడే వారికి చట్టం ముందు ఎటువంటి ఉపశమనం ఉండదని ఈ తీర్పు మరొకసారి స్పష్టం చేసింది. పిర్యాదుదారుడు మల్వత్ బాలు నాయక్, తండ్రి గోపియా నాయక్, కామారెడ్డి పట్టణంలోని గోదాం రోడ్‌లో "దేవి ఐ కేర్ క్లినిక్ డ ఆప్టికల్ షాప్" నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. అదే ప్రాంతంలో ఉన్న "లియో ఆప్టికల్స్ ఐ క్లినిక్" యజమాని నరసింహారెడ్డి, తన వ్యాపారం సరిగా నడవడం లేదనే భావంతో గత మూడు నెలలుగా పిర్యాదుదారుని వేధిస్తూ, 'నువ్వు ఇక్కడ షాప్ పెట్టడం వల్ల నాకు వ్యాపారం దెబ్బతిన్నది, నీ అంతు చూస్తా' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు తేదీ 19-04-2022 ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో, పిర్యాదుదారుడు తన షాప్‌లో



పనిచేస్తుండగా, నరసింహారెడ్డి తన సోదరులు రాజు, శ్యామ్‌లతో కలిసి షాప్‌లోకి బలవంతంగా ప్రవేశించి, షాప్‌లోని కుర్చీలు, అద్దాలు మరియు ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. అనంతరం నరసింహారెడ్డి ఫ్లోర్ క్లీనింగ్ కట్టెతో పిర్యాదుదారునిపై దాడి చేసి, ప్రాణహాని కలిగిస్తానని బెదిరించాడు. అతని సోదరులు రాజు, శ్యామ్‌లు కూడా పిర్యాదుదారునిపై దాడి చేశారు. ముగ్గురు నిందితులు కలిసి పిర్యాదుదారుని కులం పేరుతో అవమానకరంగా దూషించి, షాప్ నుంచి బయటకు లాగి రోడ్డుపై కూడా దాడి చేశారు. ఈ ఘటనపై తేదీ 20-04-2022 నాడు కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తు సమయంలో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు మరియు పరిసర ప్రాంతాల వారిని విచారించి, తగిన సాక్ష్యాధారాలను సేకరించారు. అనంతరం నిందితులు 1. సోమన్నగారి నర్సిమ్లు (వయస్సు: 49 సంవత్సరాలు) 2. సోమన్నగారి శ్యామ్ (వయస్సు: 41 సంవత్సరాలు) 3. సోమన్నగారి రాజు (వయస్సు: 38 సంవత్సరాలు), నివాసం: కామారెడ్డి అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసులో సాక్షులను విచారించి, సాక్ష్యాధారాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం, కులం పేరుతో దూషణ మరియు బెదిరింపుల నేరాలు రుజువవడంతో, నిజామాబాద్ సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ & సెషన్స్ జడ్జ్ (SC/ST కోర్టు) టి. శ్రీనివాస్, ముగ్గురు నిందితులకు 1 సంవత్సరం జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 4,500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ కేసులో పోలీసు తరఫున వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. దయాకర్ గౌడ్ ని, కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసిన అప్పటి కామారెడ్డి ఎస్ఐ జి. రాములు, అప్పటి కామారెడ్డి డీఎస్పీ ఎం. సోమనాథం, ప్రస్తుత కామారెడ్డి ఎస్‌హెచ్‌ఓ నరహరి, కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, IPS, కోర్టు లైజనింగ్ అధికారులు ఏఎస్ఐ రాజేశ్వర్, శ్రీనివాస్ మరియు సీడీఓ ఎస్. విజయ్ కుమార్ ను జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, IPS అభినందించారు.

# మహిళా సమైక్య భవనానికి భూమి పూజ....

**శివంపేట,మార్చి 31 (మహాప్రభ):**
శివంపేట మండలంలోని కొత్తపేట లో మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూమి దాత మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్, స్థానిక సర్పంచ్ రాములు, శేఖర్ గౌడ్, గ్రామ ప్రజలు హాజరయ్యారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ భవన నిర్మాణం పూర్తయితే గ్రహ మహిళలకు వివిధ సామాజిక సాంస్కృతి కార్యకలాపాలు, ఉపాధి శిక్షణ కోసం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# దుబ్బాక మండలంలో 8 లక్షల 43,000/- పైగా ముఖ్యమంత్రి సహాయ నిధులు చెక్కుల పంపిణీ

**-దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి వారి ఆదేశాల మేరకు**
**-దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి చేతుల మీదగా అందజేత**



**దుబ్బాక మార్చి 31 (మహాప్రభ):**
దుబ్బాక మండల పరిధిలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత సహకరించిన వారి చొరవతో మొత్తం 24 మందికి 8 లక్షల 43,000/- రూపాయలపైగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను దుబ్బాక చెరుకు శ్రీనివాస్ రెడ్డి వారి కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. సహాయం కోసం దరఖాస్తు వచ్చిన వెంటనే చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి తరగతిగా సహాయం అందే ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం...

**శివంపేట,మార్చి 31 (మహాప్రభ).**
శివంపేట మండలంలోని పెద్ద గొట్టిముక్కల గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు మరియు సిసి రోడ్డు పనుల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆవులరాజిరెడ్డి విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవీన్ గుప్తా, మాధవరెడ్డి మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బుర్ర మురళి గౌడ్,కమలాపూల్ సింగ్, సర్పంచ్ నవీన్ కుమార్,ఆంజనేయులు, పిల్లుట్ల ఉప



సర్పంచ్ గొల్ల స్వామి పెద్దపులి సతీష్ తలారి హనుమంతు గుల్లయ్య గారి రవి తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా సర్పంచ్ నవీన్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం చేయడానికి తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని గ్రామాన్ని అభివృద్ధి పథంలో ఉంచడానికి తాను ఎల్లవేళలా అహర్నిశలు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# బిజినెస్

## ఇండిగో కొత్త సీఈఓగా విలియమ్ వాల్ష్



ఇంటర్నెట్ డెస్క్

ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ కొత్త సీఈఓగా విలియమ్ వాల్ష్‌ను ఎంపిక చేసినట్టు సంస్థ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ సీఈఓగా ఉన్న విలియమ్ వాల్ష్ పదవీకాలం ఈ ఏడాది జులై 31న ముగుస్తుంది. ఆగస్టు 3న ఆయన ఇండిగో సీఈఓ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని సంస్థ పేర్కొంది విలియమ్ వాల్ష్ గతంలో బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ సీఈఓగా పని చేశారు. ఇండిగో సీఈఓ బాధ్యతలు దక్కడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇండిగో పునాదులు బలమైనవని అన్నారు. ఏవియేషన్ రంగం కీలక మార్పులకు లోనవుతోందని, ఈ రంగంలో అగ్రగామిగా నిలిచేందుకు ఇండిగోకు అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. సంస్థ సిబ్బందితో కలిసి పనిచేసేందుకు తాను ఉత్సుకతతో ఉన్నానని తెలిపారు.ఇండిగో సీఈఓగా విలియమ్ వాల్ష్ ఎంపిక కావడంపై సంస్థ చైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా హర్షం వ్యక్తం చేశారు. వైమానిక రంగంలో ఆయన నాయకత్వ లక్షణాలు, ట్రాక్ రికార్డు అద్భుతమని కొనియాడారు. ఇండిగోను ముందుండి నడిపించేందుకు ఆయన తగినవారని అన్నారు. సీఈఓగా విలియమ్ ఎంపికను తాను స్వాగతిస్తున్నట్టు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ భాటియా కూడా తెలిపారు.

## పెరిగిన బంగారం ధర..తులం ధర ఎంతంటే



బంగారం, వెండి ధరలు తీవ్ర ఒడుదుకులకు లోనవుతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం విలువైన లోహాల మార్కెట్ ని ఆందోళనకు గురి చేస్తోంది. ఈ ప్రభావం అటు చమురు, ఇంధన రంగాలపైన, ఇటు బంగారం, వెండిలాంటి విలువైన లోహాలపైన తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో మార్చి 31 మంగళవారం బంగారం ధర మళ్లీ పెరిగింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1,030 పెరిగి రూ.1,49,250 పలుకుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.950లు పెరిగి రూ.1,36,850 పలుకుతోంది. వెండి మాత్రం కేజీకి రూ.5000 తగ్గి రూ.2,50,000 పలుకుతోంది. దేశంలోని వివధ నగరాల్లో మార్చి 31, మంగళవారం బంగారం వెండిధరలను పరిశీలిస్తే.. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,440 వద్ద ట్రేడవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర రూ.1,37,000 పలుకుతోంది. ముంబై, కోల్‌కతాలో 24 క్యారెట్ల బంగారం రూ.1,49,290 ఉంటే, 22 క్యారెట్ల బంగారం రూ.1,36,850 పలుకుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,130 ఉంటే, 22 క్యారెట్ల బంగారం ధర రూ. రూ.1,36,700 గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,290 ఉంటే, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,36,850 లు పలుకుతోంది. వెండి ధర కిలోకి రూ.2,50,000 గా కొనసాగుతోంది. ఈ ధరలు పెరగవచ్చు, తగ్గవచ్చు.. బంగారం కొనడానికి వెళ్లేముందు ధరలు మరోసారి చెక్‌చేసుకొని వెళ్తే మంచిది.

## సరికొత్త టీవీఎస్ అపాచీ.. ప్రారంభ ధర రూ.1.12 లక్షలు

**బెంగళూరు,**

ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటర్..దేశీయ మార్కెట్లోకి నయా అపాచీ మాడల్‌ను తీసుకొచ్చింది. అత్యంత శక్తివంతమైన 160 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ మోటర్‌సైకిల్ ప్రారంభ ధర రూ.1.12 లక్షలుగా నిర్ణయించిన సంస్థ..గరిష్ఠంగా రూ.1.25 లక్షలు.మూడు రకాల్లో లభించనున్న ఈ బైకు షోరూం ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. రైడింగ్‌లో నూతన అనుభవం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నయా బైకులో పలు మార్పులు చేసినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.



# స్పోర్ట్స్

## షాహీన్ అఫ్రిదిపై భారీ జరిమానా

పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫ్రాంచైజీ లాహోర్ ఖలందర్స్ తమ స్టార్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిదిపై భారీ జరిమానా విధించింది. భద్రతా నిబంధనలను ఉల్లంఘించి నలుగురు వ్యక్తులను జట్టు బస చేస్తున్న హోటల్ గదిలోకి బలవంతంగా తీసుకెళ్లినట్లు ఆరోపణలు రావడంతో ఏకంగా రూ.10 లక్షలు (పాక్ కరెన్సీలో) ఫైన్ వేసింది. జట్టులో క్రమశిక్షణను కాపాడటం, జవాబుదారీతనాన్ని నిర్ధారించే క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. పంజాబ్ పోలీసులు పీఎస్ఎల్ సీఈఓ సల్మాన్ నసీర్ కు రాసిన లేఖలో అఫ్రిదితో పాటు ఆ జట్టు ఆటగాడు సికిందర్ రజాపై తీవ్ర ఆరోపణలు చేసినట్లు న్యూస్18 ఇంగ్లీష్ పేర్కొంది. నలుగురు సందర్శకులను హోటల్ లోకి అనుమతించాలని వీరు కోరగా భద్రతా సిబ్బంది నిరాకరించారు. అయినా సరే వారు ఆ నలుగురిని గదిలోకి తీసుకెళ్లారని, దాదాపు మూడు గంటల పాటు అక్కడే ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఏడాది జరిగిన పీఎస్ఎల్ సీజన్ లో లాహోర్ జట్టు పేలవ ప్రదర్శనతో టోర్నీ నుంచి నిష్క్రమించిన విషయం అందరికీ తెలిసిందే.



వివాదాలు కూడా ఈ జట్టును వెంటాడుతున్నాయి. ఈ ఘటనపై లాహోర్ ఖలందర్స్ యాజమాన్యం స్పందిస్తూ, క్రమశిక్షణతో జవాబుదారీతనం ప్రదర్శించే ఉద్దేశంతోనే షాహీన్ షా అఫ్రిదిపై పది లక్షల రూపాయల జరిమానాను స్వచ్ఛందంగా విధించినట్లు వెల్లడించింది. ఈ విషయమై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కు పూర్తి వివరాలతో కూడిన వివరణను అధికారికంగా పంపినట్లు తెలియజేసింది. ఆటగాళ్లు, అధికారులు, ప్రేక్షకుల భద్రతను నిర్ధారించడంలో భద్రతా సిబ్బంది చేస్తున్న కృషిని ఫ్రాంచైజీ మనస్ఫూర్తిగా ప్రశంసించింది. నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించాలనే ఆలోచన ఆటగాళ్లకు లేదని, కేవలం ఒక చిన్న అపార్థం వల్లే ఈ సమస్య తలెత్తిందని ఫ్రాంచైజీ యాజమాన్యం వివరించింది. అయితే భద్రతా ప్రోటోకాల్స్ పట్ల తమకు పూర్తి గౌరవం ఉందని వారు పునరుద్ఘాటించారు. మరోవైపు భద్రతా ఉల్లంఘన ఘటనకు తాను పూర్తి బాధ్యత వహిస్తున్నానని సికిందర్ రజా స్పష్టం చేశాడు. ఈ విషయంలో ఎవరినీ షాహీన్ బలవంతపెట్టలేదని తెలిపాడు. తన స్నేహితులు, కుటుంబ సభ్యులు వచ్చారని, వారిని గది వద్దకు తీసుకురావాలని తాను కోరినందుకే షాహీన్ సహాయం చేశాడని రజా చెప్పుకొచ్చాడు. హోటల్ నియమావళి గురించి తనకు పూర్తిగా తెలియదని, షాహీన్ కు కూడా ఈ విషయంపై పెద్దగా అవగాహన లేదని అన్నాడు. దీనికి తాను మాత్రమే కారణమని, తన కోరిక మేరకే షాహీన్ కిందకు వెళ్లాడని వివరించాడు. తన అత్యంత సన్నిహితులు కావడం వల్లే వారితో కలిసి హోటల్ వ్యాపార కేంద్రంలో కాకుండా పైకి తీసుకెళ్లి 40 నిమిషాల పాటు గదిలో మాట్లాడినట్లు రజా వెల్లడించాడు.

## సురేశ్ రైనా రికార్డు బద్దలు



ఐపీఎల్ 2026 సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం, 15 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అదరగొట్టే ప్రదర్శనతో ప్రారంభించాడు. సోమవారం గువాహటిలోని బర్సపారా స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో జరిగిన మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. 128 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన అతనికి ఖాతా తెరవకముందే అదృష్టం కలిసొచ్చింది. సీఎస్‌కే ఫీల్డర్ కార్తీక్ శర్మ క్యాచ్ డ్రాప్ చేయడంతో బతికిపోయిన వైభవ్.. ఆ తర్వాత చెన్నై బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. క్రీజులో ఉన్నంతసేపు బౌండరీలతో హోరెత్తిస్తూ 17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 52 పరుగులు చేసి అన్షుల్ కాంబోజ్ బౌలింగ్‌లో అవుట్‌గా వెనుదిరిగాడు. ఈ తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెన్నై జట్టును మ్యాచ్‌పై ఆశలు వదులుకునేలా చేశాడు. ఈ యువ కెరటం గత ఏడాది ఢిల్లీ పిచ్‌పై సీఎస్‌కే పైనే 33 బంతుల్లో 57 పరుగులు చేసి తన పరిణతిని చాటుకోగా, ఇప్పుడు విధ్వంసకర ఇన్నింగ్స్‌తో తన విశ్వరూపాన్ని పరిచయం చేశాడు. ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ శతకం సాధించిన మూడో బ్యాటర్‌గా వైభవ్ రికార్డు సృష్టించాడు. ఈ జాబితాలో యూసఫ్ పఠాన్, సునీల్ నరైన్, నికోలస్ పూరన్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్‌లతో కలిసి అతడు మూడో స్థానాన్ని పంచుకున్నాడు. ఐపీఎల్‌లో యశస్వి జైస్వాల్ (13 బంతుల్లో), కేఎల్ రాహుల్, పాట్ కమిన్స్, రొమారియో షెపర్డ్ (14 బంతుల్లో) మాత్రమే వైభవ్ కంటే ముందున్నారు. ఇక రాజస్థాన్ రాయల్స్ తరఫున ఇది రెండో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ కావడం విశేషం.గత ఏడాది జైపూర్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 17 బంతుల్లోనే ఫిఫ్టీ (ఆ మ్యాచ్‌లో 35 బంతుల్లోనే సెంచరీ సాధించాడు) చేసిన తన పాత రికార్డును అతడు ఇప్పుడు తిరగరాశాడు. సురేశ్ రైనా, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ లాంటి స్టార్లు 16 బంతుల్లో ఈ ఫీట్ సాధించగా, ఈ కుర్రాడు వారిని కూడా వెనక్కి నెట్టేయడం గమనార్హం. తొలి పూర్తి స్థాయి టోర్నీలోనే ఇలాంటి మెరుపు ఇన్నింగ్స్ ఆడటం రాజస్థాన్ ఫ్రాంచైజీకి ఎంతో సంతోషాన్నిస్తోంది.

## రిటైర్‌మెంట్‌పై ఊహగానాలకు మహ్మద్ షమీ చెక్

సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి టీమిండియాలోకి దారులన్నీ దాదాపు క్లోజ్ అయిన విషయం తెలిసిందే. వయసు ప్రభావం, ఫిట్‌నెస్ సమస్యలను కారణంగా చూపుతూ.. సెలెక్షన్ కమిటీ షమీ పేరును పరిగణలోకి తీసుకోవట్లేదు. దీంతో దేశవాళీలో సత్తా చాటుతున్నా.. షమీకి మాత్రం పిలుపురావడం లేదు. గతంలో టెస్టులు, వన్డేలు, టీ20 ఇలా మూడు ఫార్మాట్లలోనూ అదరగొట్టిన షమీని మళ్లీ టీమ్‌లోకి తీసుకోవాలని.. అతని అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని మాజీలు కూడా సూచించారు. షమీ తన చివరి వన్డే.. 2025 మార్చి 9న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఆడాడు. చివరి టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ను 2025 ఫిబ్రవరి 2న ముంబైలో ఇంగ్లాండ్‌పై ఆడాడు. ఇక టెస్టు క్రికెట్ ఆడి మూడేళ్లకుపైనే అయింది. ఈ నేపథ్యంలోనే షమీ రిటైర్‌మెంట్ విషయంపై క్లారిటీ ఇచ్చేశాడు.'ది శుభంకర్ మిశ్రా షో' మహ్మద్ షమీ మాట్లాడుతూ.. తాను అలసిపోయినప్పుడు క్రికెట్ వీడ్కోలు పలుకుతానని.. ప్రస్తుతానికి రిటైర్‌మెంట్ గురించి ఆలోచించడం లేదని



స్పష్టం చేశాడు. రిటైర్‌మెంట్ ఆలోచన మనల్ని మరింత వెనక్కి లాగుతుందని.. ఆ ఆలోచన వస్తే అప్పటికే అలసిపోయారని అర్థమన్నారు. ఏ రోజు ఉదయాన్ని తాను నిద్రలేచిన తరువాత విసుగు పుడుతుందో.. అదే రోజు ఆటకు గుడ్ బై చెబుతానని అన్నాడు. బద్ధకం వచ్చినా.. విసుగు పుట్టినా.. అలసిపోయినా రిటైర్‌మెంట్ ప్రకటిస్తానని వెల్లడించాడు. ప్రస్తుతం తనకు బద్ధకం లేదని.. ఆటను ఆస్వాదిస్తున్నానని చెప్పుకొచ్చాడు షమీ. ఒక బౌలర్‌గా తాను వందశాతం తన బాధ్యతలు నెరవేరుస్తానని.. తనపై ఉంచిన అంచనాలకు అనుగుణంగా రాణిస్తానని అన్నాడు. గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన షమీ.. ఈసారి లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. షమీపై ూ=ఎ టీమ్ భారీ అంచనాలు పెట్టుకోగా.. ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఐపీఎల్ మినీ వేలానికి ముందు గుజరాత్ టైటాన్స్ టీమ్‌తో ట్రెడ్ డీల్ చేసుకుంది. లక్నో తరఫున దుమ్ములేపి.. టీమిండియా జెర్సీలో షమీని మళ్లీ చూడాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.



## మాస్ లుక్ లో ఫరియా అబ్దుల్లా

టాలీవుడ్ చిట్టి అలియాస్ ఫరియా అబ్దుల్లా.. హిట్ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తుంది. మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్న ఈ సుందరి. ఆతర్వాత పెద్దగా సక్సెస్ సాధించలేకపోతుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న పెద్దగా లాభం లేకుండా పోతుంది. జాతిరత్నాలు సినిమాతో పరిచయమైన ఫరియా.. ఆ సినిమాలో తన క్యూట్ పర్ఫామెన్స్ తో కట్టిపడేసింది. అలాగే తర్వాత వచ్చిన సినిమాల్లో గ్లామరస్ గా కనిపించి కవ్వించింది. తన అందాలతో మతిపోగొట్టింది ఫరియా అబ్దుల్లా.. కానీ సినిమాలు పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. సింహ హీరోగా నటించిన మత్తువదలరా 2 సినిమా ఒక్కటి కాస్త పర్లేదు అనిపించుకుంది. కానీ ఆతర్వాత మళ్లీ ఫ్లాప్స్ పలకరించాయి. చివరిగా ఈ అమ్మడు గుర్రం పాపిరెడ్డి అనే సినిమాలో నటించింది. ఇక ఇప్పుడు రూటు మార్చి మాస్ పాత్రతో ఆకట్టుకోనుంది. ప్రస్తుతం ఫరియా అబ్దుల్లా భగవంతుడు అనే సినిమాలో నటిస్తుంది. ఇటీవలే ఈ సినిమా నుంచి టీజర్ ను విడుదల చేశారు. ఈ టీజర్ లో ఫరియా అబ్దుల్లా మాస్ పాత్రలో కనిపించింది. అలాగే బోల్డ్ గానూ నటించింది. ఈ సినిమాతో ఫరియా అబ్దుల్లా హిట్ కొట్టేలా కనిపిస్తుంది.కాగా సోషల్ మీడియాలో మాత్రం ఈ అమ్మడు ఓ రేంజ్ లో అందాలతో రచ్చ చేస్తుంది. కుర్రాళ్లు చూపుతిప్పుకోనివ్వకండా ఫోటోలు షేర్ చేస్తుంది. ఈ సుందరి షేర్ చేసే ఫోటోలకు కుర్రకారు ఫిదా అవుతున్నారు. నెటిజన్స్ రెచ్చిపోయి కామెంట్స్ చేస్తున్నారు.



## పర్వీన్ బాబీ బయోపిక్‌లో?

బాలీవుడ్ లెజెండరీ హీరోయిన్ పర్వీన్ బాబీ జీవితం ఆధారంగా బాలీవుడ్‌లో సినిమా రానున్నది. జోయా మెహ్రా తెరకెక్కించనున్న ఈ చిత్రంలో పర్వీన్ బాబీగా త్రిప్తి డిమ్రీ కనిపించనున్నది. పర్వీన్‌బాబీ జీవితంలోని గ్లామర్, వివాదాలు, వ్యక్తిగత పోరాటాలు.. వీటన్నింటినీ సమతుల్యంచేసి, అద్భుతమైన బయోపిక్‌గా ఈ చిత్రాన్ని తెరమీదకు తీసుకురావాలనే ప్రయత్నంలో మేకర్స్ ఉన్నారు.అయితే.. పర్వీన్‌గా త్రిప్తిని ఎంపిక చేయడంపై బాలీవుడ్‌లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గొప్పనటిగా కీర్తింపబడ్డ పర్వీన్‌బాబీ పాత్రకు త్రిప్తి న్యాయం చేయగలదా? అంటూ కొందరు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ఈ డిబేట్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేటయింది. త్రిప్తి డిమ్రీపై మేకర్స్ మాత్రం పూర్తి నమ్మకంతో ఉన్నారు. త్వరలోనే సినిమా సెట్స్‌కి వెళ్లనుంది.

## ‘కథనార్’ ట్రైలర్ రిలీజ్..

### అనుష్క మరోసారి పీరియాడిక్ అవతారంలో మెప్పించనుందా?




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ‘బాహుబలి’ తర్వాత సినిమాల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. అడపాదడపా సినిమాలు చేస్తూ వస్తున్న ఆమె ఇటీవల ‘ఘాటీ’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అయితే ఇప్పుడు భారీ అంచనాల మధ్య మలయాళంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ మూవీ ‘కథనార్’తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మాణంలో, దర్శకుడు రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో అనుష్కతో పాటు జయసూర్య, ప్రభుదేవ , సనూప్ సన్, వినీత్, శాండీ మాస్టర్, హరీష్ ఉత్తమన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మలయాళంలో రూపొందుతున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.తాజాగా విడుదలైన ‘కథనార్’ ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజువల్స్, సెట్టింగ్స్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్రైలర్‌లో అనుష్క కనిపించిన తీరు, ఆమె పాత్రలో ఉన్న గంభీరత, మిస్టరీ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకంగా చెప్పాలంటే, ఈ సినిమాలో ఫాంటసీ, హారర్, థ్రిల్లర్ అంశాలను మేళవించి రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. ఇక అనుష్క ఫ్యాన్స్ మాత్రం ఈ సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ‘బాహుబలి’ తరహాలోనే మరోసారి బలమైన పాత్రలో ఆమె కనిపించనుందని ట్రైలర్ సంకేతాలు ఇస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఇటీవల వరుసగా వచ్చిన సినిమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోయినా, ‘కథనార్’తో అనుష్క మళ్లీ బలంగా కంబ్యాక్ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈ చిత్రం విడుదలైన తర్వాత ఆమె కెరీర్‌కు మళ్లీ ఊపిరి పోస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

## కుర్రాళ్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న దివ్య భారతి



ఒకే ఒక్క సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్స్ గా మారిన హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. తమ అందంతో కుర్రకారుకు కిర్రెక్కించి.. డ్రీమ్ గర్ల్ అనే ట్యాగ్ ను సొంతం చేసుకున్న వారిలో దివ్య భారతి ఒకరు. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తమిళ్ సినిమా బ్యాచిలర్ మూవీతో సినిమా ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది ముద్దుగుమ్మ దివ్య భారతి.. ఈ సినిమాలో బోల్డ్ పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించింది ఈ సుందరి. దాంతో ఈ బ్యూటీకి కుర్రాళ్ళు ఫిదా అయ్యారు. ఆతర్వాత ఈ అమ్మడు వరుస సినిమాలతో బిజీ అవుతుందని అంతా అనుకున్నారు. కానీ అలా జరగలేదు. చాలా గ్యాప్ తర్వాత జీవి ప్రకాష్ తో కలిసి కింగ్ స్టన్ అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఇక ఇప్పుడు తెలుగులో సినిమాలు చేస్తుంది ఈ అందాల తార. సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న గోట్ సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది. కానీ ఈ సినిమా విడుదలకు మాత్రం నోచుకోవడం లేదు.. ఎప్పటినుంచో ఈ సినిమా షూటింగ్ జరుగుతూ ఉంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ అవుతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో దివ్యభారతి ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గ్లామరస్ ఫొటోలతో నెటిజన్స్ ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది దివ్య భారతి. తాజాగా ఈ అమ్మడు వదిలిన ఫోటోలు కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తున్నాయి.

## ప్రభాస్ స్పీడ్‌కు ఇండస్ట్రీ షాక్!

### ఒకేసారి మూడు పాన్ ఇండియా చిత్రాలతో బిజీ..



ప్రస్తుతం స్టార్ హీరోలు ఏడాదికి ఒక సినిమాని రిలీజ్ చేయడానికే భారీగా శ్రమిస్తున్న సమయంలో, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన పని తీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఒకేసారి రెండు సినిమాలు చేయడమే కష్టమైన ఈ రోజుల్లో, ప్రభాస్ ఏకకాలంలో మూడు భారీ ప్రాజెక్టులను నిర్వహిస్తూ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ప్రభాస్ ‘స్పిరిట్’, ‘ఫౌజీ’, ‘కల్కి 2’ వంటి మూడు భారీ బడ్జెట్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలు భిన్నమైన కథాంశాలు, వేర్వేరు పాత్రలతో తెరకెక్కుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి షూటింగ్‌లలో పాల్గొనడం పెద్ద సవాలే. రెండు మూడు నెలలుగా ‘ఫౌజీ’, ‘స్పిరిట్’ షూటింగ్‌లలో నిరంతరం పాల్గొంటున్నప్రభాస్, ఇప్పుడు ‘కల్కి 2’ షూటింగ్‌కు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటివరకు ఆయన లేకుండా తీసిన సన్నివేశాలను పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇక నుంచి ప్రభాస్‌తో కూడిన షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.మూడు సినిమాలు ఒకేసారి చేయడం వల్ల ప్రభాస్ షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో గడపాల్సి వస్తోంది. ప్రతి సినిమాలో వేర్వేరు లుక్స్, బాడీ లాంగ్వేజ్ అవసరం కావడంతో పాత్రల మధ్య తేడాను కచ్చితంగా చూపించాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రభాస్ పనితీరు ఆయన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌ను స్పష్టంగా చూపిస్తోంది. గతంలో కూడా ‘సలార్’, ‘కల్కి 2898’, ‘ఆదిపురుష్’ వంటి సినిమాలను ఒకేసారి బ్యాలెన్స్ చేసిన అనుభవం ఆయనకు ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మరింత కఠినంగా ఉండటంతో ఆయనపై ఒత్తిడి కూడా పెరిగింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో ఉన్న చాలా మంది స్టార్ హీరోలు ఒకేసారి ఒక్క ప్రాజెక్ట్‌పైనే దృష్టి సారిస్తుంటే, ప్రభాస్ మాత్రం తన పని వేగంతో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మూడు సినిమాలను సమాంతరంగా నిర్వహిస్తూ, ప్రతి ప్రాజెక్ట్‌కు న్యాయం చేయడం ద్వారా ఆయన ప్రత్యేకతను మరోసారి నిరూపిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ చేస్తున్న ఈ మల్టీ-ప్రాజెక్ట్ వర్క్ స్టైల్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకేసారి మూడు భారీ సినిమాలు చేయడం చిన్న విషయం కాదని, ఇది ఆయన అంకితభావానికి నిదర్శనమని సినీ వర్గాలు ప్రశంసిస్తున్నాయి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com